నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవలది

మాటయివ్వబోకు మనసు సంతసమున
వలదు నిర్ణయాలు బాధలోన
అలకయున్నవేళ అభిమతము వలదు
బ్రతుకుసూత్రమిదియె భరతపుత్ర

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంపుటి : 03 | సంచిక : 77 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం 14 సెప్టెంబర్ 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# తలసేమియా బాధితులకు అండగా ప్రపంచవ్యాప్త రక్తదాన కార్యక్రమం




- ★ సింగపూర్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎన్ఆర్ఐ యువత సేవా స్ఫూర్తి
- ★ 50 మంది స్వచ్ఛంద రక్తదానం
- ★ ప్రతి నెల రెండో శనివారం ప్రపంచవ్యాప్తంగా కార్యక్రమాల నిర్వహణకు సంకల్పం
- ★ తలసేమియా బాధితులకు ప్రపంచవ్యాప్త సేవా సంకల్పం
- ★ సింగపూర్‌లో కరీంనగర్ ఎన్ఆర్ఐ యువత రక్తదానం
- ★ స్వచ్ఛందంగా రక్తం ఇచ్చిన 50 మంది యువకులు
- ★ ప్రతి నెల రెండో శనివారం రక్తదాన కార్యక్రమాలు
- ★ తెలంగాణ ప్రవాసులను సేవా ఉద్యమంలో భాగస్వామ్యం చేసే లక్ష్యం
- ★ ఇప్పటివరకు 2,850 మందికి పైగా రక్తదానం
- ★ పూట్కూరి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు
- ★ విదేశాల్లోనూ చాటుకున్న మానవత్వం
- ★ తలసేమియా బాధితులకు రక్తమే జీవనాధారం
- ★ రక్తదానం ద్వారా ప్రాణాలకు భరోసా
- ★ యువత సేవా స్ఫూర్తికి సింగపూర్ వేదిక
- ★ ప్రపంచవ్యాప్తంగా విస్తరించనున్న రక్తదాన ఉద్యమం

**సింగపూర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలసేమియా బాధితులకు అండగా నిలిచి వారి జీవితాల్లో భరోసా నింపాలనే గొప్ప సంకల్పంతో తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ చేపడుతున్న రక్తదాన కార్యక్రమానికి సింగపూర్‌లోని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎన్ఆర్ఐ యువత అండగా నిలిచింది. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో సుమారు 50 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ తమ ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని సామాజిక సేవ ద్వారా చాటుకున్నారు.

**తలసేమియా బాధితుల కోసం రక్తదానం:** తలసేమియా బాధితులకు తరచూ రక్తం అవసరమయ్యే పరిస్థితి ఉంటుంది. అలాంటి వారికి సకాలంలో రక్తం అందేలా స్వచ్ఛంద రక్తదాతలను సమీకరించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. రక్తదానం చేసిన రక్తాన్ని అవసరమైన తలసేమియా బాధితులకు అందించడం ద్వారా వారి చికిత్సకు అండగా నిలవాలని సంకల్పించినట్లు పేర్కొన్నారు. ఒక్కసారి రక్తదానం చేసి కార్యక్రమాన్ని ముగించడం కాకుండా నిరంతర సేవగా కొనసాగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. సమాజంలో రక్తం అవసరమైన ప్రతి సందర్భంలో స్వచ్ఛంద రక్తదాతలు అందుబాటులో ఉండేలా ఒక సేవా వ్యవస్థను నిర్మించాలన్నదే సంస్థ లక్ష్యమని తెలిపారు.

# ఆర్యవైశ్యులది ఆత్మగౌరవ జీవనం

- కష్టాల్లోనూ గౌరవమే వారికి ముఖ్యం
- ఆర్యవైశ్యుల శ్రేయస్సే నా లక్ష్యం
- ప్రపంచంలో రెండే ప్రధాన వృత్తులు
- వ్యవసాయం, వ్యాపారమే మూలాధారం
- రోశయ్య సేవలు చిరస్మరణీయం
- హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటు
- ప్రపంచస్థాయి నాయకుడు మహాత్మాగాంధీ
- ఆర్యవైశ్య బిడ్డగా గాంధీకి గర్వకారణం
- దేశ సమగ్రత కోసం గాంధీ ప్రాణత్యాగం
- ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు త్యాగం

'ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం అధికంగా ఉన్నవారు. చాలామంది పేదలున్నా, ఆత్మగౌరవం కోసం పేదలుగా గుర్తింపు తెచ్చుకోవడానికి ఇష్ట పడరు'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సభనుద్దేశించి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కష్టాలు, బాధలు ఉన్నా సమాజంలో గౌరవం కోసం జీవించేవారు.



# ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు : ముఖ్యమంత్రి చంద్రబాబు

రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు
అన్ని వర్గాలను ఏకం చేసే సామాజిక పండుగ అని వెల్లడి
మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపు
రాష్ట్ర అభివృద్ధికి ఆటంకాలు తొలగాలని గణనాథుడిని ప్రార్థించినట్లు వెల్లడి





# సమ్మిళిత ప్రపంచ వృద్ధే లక్ష్యం

- ♦ భౌగోళిక ఉద్రిక్తతలపై మోదీ ఆందోళన
- ♦ మానవాళి కోసం బ్రిక్స్ ఉమ్మడి కృషి
- ♦ సహకారంతో సవాళ్లకు ఎదురుదాం
- ♦ సాంకేతికతను ఆయుధంగా మార్చొద్దు
- ♦ కీలక ఖనిజాల వినియోగంపై హెచ్చరిక
- ♦ గ్లోబల్ సౌత్‌కు బ్రిక్స్‌పై విశ్వాసం
- ♦ ఏ సంక్షోభమూ ఒక ప్రాంతానికే పరిమితం కాదు
- ♦ ముందస్తు హెచ్చరిక వ్యవస్థకు అంగీకారం
- ♦ సరఫరా వ్యవస్థలను మరింత దృఢం చేయాలి
- ♦ స్టార్టప్‌లకు బ్రిక్స్ కొత్త ప్రోత్సాహం
- ♦ నగరాల అభివృద్ధికి అర్బన్ మొబిలిటీ హబ్
- ♦ అభివృద్ధి -పర్యావరణం పరస్పర పూరకాలు
- ♦ భావి తరాల పట్ల మన బాధ్యత
- ♦ స్వచ్ఛ ఇంధనానికి బ్రిక్స్ డిజిటల్ కేంద్రం

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సామాన్య ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సవాళ్లను ఎదుర్కొని మానవాళి కోసం బ్రిక్స్ కూటమి ఉమ్మడిగా కృషి చేయాలని, సహకారం, సమ్మిళిత వృద్ధి ద్వారా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం

**పర్యావరణాన్ని పరిరక్షిద్దాం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా జరుపుకోవాలని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. దేశ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని దైవ స్వరూపంగా భావించి.. నదులు, వృక్షాలు, పర్వతాలు, జీవరాశులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని పేర్కొన్నారు. తొలి పూజలందుకునే వినాయకుడి అర్చనలో ఉపయోగించే పత్రి, పుష్పాలు వృక్ష సంపదతో, ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని చాటుతాయని అన్నారు.

**పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు :** వినాయకచవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజలకు పిలుపునిచ్చారు. సంప్రదాయబద్ధంగా మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని సూచించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.




# మెగా డీఎస్సీలో భారీ స్కామ్

- ★ డీఎస్సీ పోస్టింగ్‌లో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ అధినేత జగన్ ఆరోపణలు
- ★ 65 మార్కుల నుంచి 77 మార్కులకు మారిన వైనంపై సందేహాలు
- ★ అర్హత లేని టెట్ పేపర్‌తో ఉద్యోగం ఇచ్చారని విమర్శ
- ★ ఈ స్కాంపై చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ నియామకాలకు సంబంధించిన వ్యవహారంపై మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మరోసారి ప్రశ్నలు సంధించారు. డీఎస్సీ అక్రమాలకు సంబంధించి రోజుకో అంశాన్ని ప్రస్తావిస్తూ ఎక్స్ వేదికగా పోస్టులు చేస్తున్న ఆయన.. ప్రభుత్వం ఇస్తున్న వివరణలు మరిన్ని అనుమానాలకు, ప్రశ్నలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఒక అభ్యర్థి అర్హత, టెట్ మార్కులు, వెరిఫికేషన్ ప్రక్రియపై పలు ప్రశ్నలను జగన్ లేవనెత్తారు. వైఎస్ జగన్ ప్రస్తావించిన తొలి అంశం 65 మార్కులకు సంబంధించినది. టెట్‌లో 65 మార్కులు వచ్చినప్పటికీ ఓ అభ్యర్థికి టీచర్ ఉద్యోగం ఎలా లభించిందని ప్రశ్నించారు.






పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు

**వినాయక చవితి శుభాకాంక్షలు**

**సెలవు**

వినాయక చవితి సందర్భంగా సోమవారం మా కార్యాలయాలకు సెలవు కావున
**మంగళవారం (15-9-2026) సంచిక**
వెలువడదు. పునర్దర్శనం బుధవారం.
- మేనేజింగ్ డైరెక్టర్

# తలసేమియా బాధితులకు అండగా ప్రపంచవ్యాప్త రక్తదాన కార్యక్రమం

**ప్రపంచవ్యాప్తంగా ప్రతి నెల రెండో శనివారం రక్తదాన కార్యక్రమాలు నిర్వహించాలనే లక్ష్యం :** తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ అధ్యక్షుడు వూట్కూరి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే నిరంతర రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని ఇకపై ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ప్రతి నెల రెండో శనివారం రక్తదాన కార్యక్రమాలు నిర్వహించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రవాసులు, ముఖ్యంగా యువతను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. ఆయా దేశాల్లోని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రక్తదాన కార్యక్రమాలు నిర్వహించి, సేకరించిన రక్తాన్ని అవసరమైన తలసేమియా బాధితులు, ఇతర అత్యవసర వైద్య అవసరాలున్న వారికి అందించేందుకు సమన్వయం చేయనున్నట్లు తెలిపారు.





**2,850 మందికి పైగా రక్తదానం :** ఈ సందర్భంగా బైరి రవి మాట్లాడుతూ.. వూట్కూరి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటివరకు 2,850 మందికి పైగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. నిరంతరంగా రక్తదాన కార్యక్రమాలను నిర్వహిస్తూ అవసరమైన వారికి రక్తాన్ని అందించేందుకు చేస్తున్న కృషి ఎంతో ప్రశంసనీయమని అన్నారు. తలసేమియా బాధితులకు రక్తం అత్యవసరంగా అవసరమవుతుందని, వారి చికిత్సలో రక్తదాతల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు యువతను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలన్నదే లక్ష్యమన్నారు. స్వదేశానికి వేల కిలోమీటర్ల దూరంలో సింగపూర్‌లో నివసిస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా యువత ఒకే వేదికపైకి వచ్చి రక్తదానం చేయడం సేవా స్ఫూర్తికి నిదర్శనమని పలువురు అభినందించారు. ఉద్యోగాలు, వ్యాపారాలతో బిజీగా ఉన్నప్పటికీ సమాజ సేవ కోసం సమయాన్ని కేటాయించడం ఆదర్శనీయమన్నారు. రక్తదానం కేవలం ఒక సేవా కార్యక్రమం మాత్రమే కాదని.. అవసరమైన సమయంలో ఒకరి ప్రాణాన్ని కాపాడే మానవతా చర్య అని పేర్కొన్నారు. యువతలో సేవా భావాన్ని పెంపొందించడంతో పాటు ప్రవాస భారతీయులను సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఆరోగ్యంగా ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరూ వైద్యుల సూచన మేరకు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని బైరి రవి పిలుపునిచ్చారు. ప్రమాదాలు, అత్యవసర వైద్యం, శస్త్రచికిత్సలు, ప్రసవాలు, తలసేమియా వంటి వైద్య పరిస్థితుల్లో రక్తం అవసరమవుతుందని తెలిపారు. యువత విద్య, ఉద్యోగం, వ్యాపార రంగాల్లో రాణించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావాలని కోరారు. రక్తదానం వంటి కార్యక్రమాల ద్వారా కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా మానవత్వాన్ని చాటుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బైరి రవి, పి. శేఖర్, కె. రమ్జాన్, కె. శ్యామ్, కె. ప్రశాంత్, ఎన్. శ్రీనివాస్, అనిల్, వెంకటేష్, ప్రవీణ్, యు. స్వామి, గంగాధర్, నరసన్న, నవీన్, రాంసుందర్, రాజ్‌కుమార్, లక్ష్మణ్‌రాజు తదితరులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సింగపూర్‌లో రక్తదానం చేసి తలసేమియా బాధితులకు అండగా నిలిచిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎన్‌ఆర్‌ఐ యువతను తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ప్రతినిధులు అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస యువతను ఈ సేవా ఉద్యమంలో భాగస్వాములను చేసి, ప్రతి నెల రెండో శనివారం రక్తదాన కార్యక్రమాలను నిర్వహించాలనే లక్ష్యాన్ని విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని నిర్వాహకులు కోరారు.

# సమ్మిళిత ప్రపంచ వృద్ధే లక్ష్యం

ఆదివారం బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆధునిక సాంకేతికతను, అరుదైన ఖనిజాలను కొన్ని దేశాలు స్వలాభం కోసం అస్త్రాలుగా మార్చుకోవడంపైఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రపంచదేశాల ఉమ్మడి పురోగతికి, శ్రేయస్సుకు ఆటంకం కలిగిస్తుందన్నారు. గ్లోబల్ సౌత్‌లోని అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకను వినడం, వారి అనుభవాలకు విలువ ఇవ్వడం, భాగస్వామ్యం ఏర్పర్చుకోవడం వల్ల అవి బ్రిక్స్‌ను ఎక్కువగా విశ్వసిస్తున్నాయని చెప్పారు. మన వైవిధ్యమే మన గుర్తింపు, మన సహకారమే మన స్ఫూర్తి, మన పురోగతి సకల మానవాళికి సేవగా మారాలని బ్రిక్స్ సభ్యదేశాలకు పిలుపునిచ్చారు.

**సమ్మిళిత ప్రపంచ వృద్ధిని ఆకాంక్షిస్తున్నాం :** అస్థిరమైన భౌగోళిక--రాజకీయ వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవడానికి బ్రిక్స్ దేశాల మధ్య సహకారం బలోపేతం కావడం అత్యంత కీలకమని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. కూటమికి భారత్ అధ్యక్షత వహించడం నిబ్బరం, ఆవిష్కరణ, సహకారం మరియు సుస్థిరత అనే నాలుగు స్తంభాలపై కేంద్రీకృతమై ఉందని తెలిపారు. ఈ నాలుగు మూలస్తంభాల ఆధారంగా బ్రిక్స్ ద్వారా సమ్మిళిత ప్రపంచ వృద్ధిని భారత్ ఆకాంక్షిస్తోందని వ్యాఖ్యానించారు. ఎందుకంటే కూటమిలో అభివృద్ధి చేసిన పరిష్కారాల ప్రయోజనాలు కేవలం భారత్‌కే పరిమితం కాకూడదని, గ్లోబల్ సౌత్ దేశాలకు సైతం అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు స్పష్టంచేశారు. కూటమిలో అందరి సహకారం, మద్దతుతో మన ఉమ్మడి దృక్పథాన్ని పరస్పర ప్రయోజనకరమైన సహకారంగా మార్చగలగడం సంతోషాన్నిస్తోందని మోదీ ఉద్ఘాటించారు.

**ఏ సంక్షోభమూ ఒకే ప్రాంతానికి కాదు :** నేడు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఘర్షణలు, ఉద్రిక్తతల కారణంగా సామాన్య ప్రజలే అధికంగా నష్టపోతున్నారని మోదీ గుర్తుచేశారు. మహమ్మారులు, వాతావరణ విపత్తులు, సరఫరా వ్యవస్థలో అంతరాయాల వంటివి నేటి పరస్పర అనుసంధానిత ప్రపంచంలో ఏ సంక్షోభమూ ఒకే ప్రాంతానికి పరిమితం కాదని నిరూపించాయని తెలియజేశారు. అందుకే బ్రిక్స్ కూటమిలో పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. సవాళ్లను సకాలంలో గుర్తించడం, వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉ ఒడడం, తక్షణ చర్యలు చేపట్టడం ముఖ్యమని వివరించారు. అంటువ్యాధుల నివారణ, వాటిపై స్పందించేందుకు 'బ్రిక్స్ సమగ్ర ముందస్తు హెచ్చరిక వ్యవస్థ'ను ఏర్పాటు చేయడానికి అంగీకరించామని అన్నారు. అలాగే విపత్తు నిర్వహణ కోసం 'ముందస్తు హెచ్చరిక సమాచార అనుసంధాన మార్గదర్శకాలు'రూపొందించినట్లు తెలిపారు. సప్లై చైన్లను మరింత విశ్వసనీయంగా, దృఢంగా మార్చడానికి 'బ్రిక్స్ లాజిస్టిక్స్ సప్లై చైన్ కోఆపరేషన్ ఫ్రేమ్‌వర్క్' తోడ్పడుతుందని అన్నారు. ఆవిష్కరణల విభాగంలో బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్ మన స్టార్టప్‌లను, ఇంక్యుబేటర్లను ఒకదానితో ఒకటి అనుసంధానిస్తుందని వెల్లడించారు. 'బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్'ను ప్రతిపాదించినట్లు స్పష్టంచేశారు. సాంకేతికతను, కీలక ఖనిజాలను ఆయుధాలుగా మార్చడం మన ఉమ్మడి పురోగతికి ఆటంకం కలిగిస్తుందన్నారు. అందుకే సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడంలో సమ్మిళితత్వానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు మోదీ చెప్పారు.

**'బ్రిక్స్ కనెక్ట్'తో ఉపాధి అవకాశాలు :** బ్రిక్స్ కూటమిలోని వివిధ వేదికల ద్వారా స్నేహం, భాగస్వామ్యం, సహకారాన్ని పెంపొందించినట్లు ప్రధాని వివరించారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కావడం సరైంది కాదన్నారు. పారిశ్రామికవేత్తలు, రైతులు, పరిశోధకులు, మహిళలు, యువత, సామాన్య పౌరులను ఇందులో క్రియాశీల భాగస్వాములుగా మార్చడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. 'బ్రిక్స్ కనెక్ట్'ద్వారా నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు, పనిలో మహిళల భాగస్వామ్యం, సామాజిక భద్రత, సామర్థ్య పెంపుదల వంటి అంశాలను ప్రోత్సహించామని అన్నారు. చిన్న తరహా పరిశ్రమలను పరిజ్ఞానం, ఆర్థిక వనరులు, కొత్త మార్కెట్లతో అనుసంధానించేందుకు 'బ్రిక్స్ ఎంఎస్‌ఎంఈ కోఆపరేషన్ పోర్టల్'ను ప్రారంభించామని వెల్లడించారు. మన నగరాల మధ్య ఉత్తమ విధానాల పరస్పర బదిలీని సులభతరం చేసేందుకు 'బ్రిక్స్ అర్బన్ మొబిలిటీ హబ్'ను ఏర్పాటు చేశామన్నారు.

**భావి తరాల పట్ల అది మన బాధ్యత :** భారతీయ నాగరికతలో ప్రకృతికి కన్నతల్లి స్థానం ఉందని గుర్తుచేశారు. అభివృద్ధి, పర్యావరణం అనేవి ఒకదానికొకటి ప్రత్యామ్నాయాలు కాదని, అవి పరస్పర పూరకాలని శతాబ్దాలుగా విశ్వసిస్తున్నామని ఉద్ఘాటించారు. మానవాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పట్ల కచ్చితంగా సమతుల్యత పాటించాలని తేల్చిచెప్పారు. భావి తరాల పట్ల అది మన బాధ్యత అని సూచించారు. ఆ దిశగా పలు అంశాల్లో తాము పురోగతి సాధించామన్నారు. స్మార్ట్ గ్రిడ్లు, ఇంధన నిల్వ కోసం 'బ్రిక్స్ డిజిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేశామని, ఇది స్వచ్ఛ ఇంధన వ్యవస్థలను మరింత విశ్వసనీయంగా, సమర్థవంతంగా మార్చడానికి, అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి దోహదపడుతుందని ప్రధాని చెప్పారు.

# మెగా డీఎస్సీలో భారీ స్కామ్

ఉద్యోగ నియామకానికి ముందు ఆ అభ్యర్థి ఏకంగా ఏడు దశల వెరిఫికేషన్‌ను పూర్తి చేసినట్లు చెబుతున్నారని, అలాంటప్పుడు అతని అర్హతను ఆ దశల్లో ఎందుకు గుర్తించలేకపోయారని నిలదీశారు. ఇదే వ్యవహారంలో డీఈవో ఆ అభ్యర్థిని అనర్హుడిగా తేల్చిన అంశాన్ని కూడా ప్రస్తావించారు. ఏడు దశల వెరిఫికేషన్ జరిగిన తర్వాత కూడా అభ్యర్థి అనర్హుడని డీఈవో ఎలా గుర్తించారని ప్రశ్నించారు. ఉద్యోగం ఎలా వచ్చిందో తనకే తెలియదని ఆ అభ్యర్థి చెప్పే పరిస్థితి ఉంటే.. మరి ఏడుసార్లు నిర్వహించిన వెరిఫికేషన్‌లో అసలు ఏం పరిశీలించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మరో కీలక అంశంగా 2018 టెట్‌లో వచ్చినట్లు చెబుతున్న 77 మార్కులను వైఎస్ జగన్ ప్రస్తావించారు. అధికారులు ఇప్పుడు ఆ అభ్యర్థికి 2018లో నిర్వహించిన టెట్‌లో 77 మార్కులు వచ్చినట్లు నిర్ధారించారని పేర్కొన్నారు. ఆ మార్కులు అప్పటికే అధికారిక రికార్డుల్లో ఉన్నట్లయితే, నియామక ప్రక్రియలో వాటిని ముందుగానే ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని ప్రశ్నించారు. అలాగే డీఈవో ఆ అభ్యర్థిని అనర్హుడిగా ఎందుకు ప్రకటించాల్సి వచ్చిందని, ప్రశ్నలు లేవనెత్తిన తర్వాతే 77 మార్కుల అంశంపై వివరణ ఎందుకు వెలుగులోకి వచ్చిందని జగన్ ప్రశ్నించారు. ఇక 77 మార్కులు ఏ టెట్ పేపర్‌కు సంబంధించినవన్న అంశంపైనా వైఎస్ జగన్ సందేహాలు వ్యక్తం చేశారు. ఆ మార్కులు పేపర్-2లో వచ్చినట్లు అధికారులు చెబుతున్నారని, అయితే ఎస్‌జీటీ పోస్టుకు అవసరమైన టెట్ కేటగిరీ పేపర్-×-ూ అని పేర్కొన్నారు. అలాంటప్పుడు సంబంధిత అర్హతలను సరిగా పరిశీలించకుండానే ఆ అభ్యర్థి ఏడు దశల వెరిఫికేషన్‌ను ఎలా దాటారని ప్రశ్నించారు. అంతేకాకుండా ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా అదే అభ్యర్థి 2025లో మరోసారి టెట్ పరీక్ష రాసిన విషయాన్ని ప్రస్తావించారు. 2018లోనే 77 మార్కులు సాధించి అర్హత పొందినట్లయితే.. మళ్లీ 2025లో టెట్ రాయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని నిలదీశారు. ఈ పరిణామాలన్నింటిపై ప్రభుత్వం సమగ్రంగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామక ప్రక్రియ పారదర్శకతపై వైఎస్ జగన్ తీవ్ర ప్రశ్నలు లేవనెత్తారు. ఇదేనా నిష్పక్షపాతమైన, పారదర్శకమైన నియామక ప్రక్రియ అని ప్రశ్నించారు. ఇలాంటి వ్యవహారాలే డీఎస్సీ స్కామ్‌కు అవకాశం కల్పించలేదా అని నిలదీశారు. డీఎస్సీకి సంబంధించిన ఆరోపణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా నైతిక బాధ్యత వహిస్తారా? లేదా? అని మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రశ్నించారు.

## నేరప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో జీవించాలని సూచన



**నంద్యాల, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా పోలీసులు రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి నేరప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కుటుంబ పరిస్థితులు, జీవనోపాధి గురించి తెలుసుకున్న అధికారులు ఇకపై అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, తిరిగి నేరాలకు పాల్పడితే బైండోవర్ కేసులు, అవసరమైతే పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, నేర నియంత్రణకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

## ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు : ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి (సెప్టెంబరు 13) పండుగ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి, విజయాలను అందించే వినాయకుడిని ప్రతి ఇంటా భక్తిశ్రద్ధలతో కొలుస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పందిస్తూ, "వినాయక చవితి అనేది ఊళ్లు, పట్టణాలు అనే తేడా లేకుండా వాడవాడలా ఎంతో ఘనంగా జరుపుకునే పండుగ. అన్ని వర్గాల ప్రజలను ఒక్కచోట చేర్చే గొప్ప సామాజిక వేడుక ఇది" అని వివరించారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను నొక్కిచెబుతూ, ప్రజలందరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. తద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే పర్యావరణానికి మేలు చేసినవారమవుతామని సూచించారు. ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా ఆశీర్వదించాలని తాను గణనాథుడిని ప్రార్థిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తన సందేశంలో వివరించారు.

## ఏపీ టెట్ ఫలితాలు విడుదల

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు శుభవార్త. ఏపీ టెట్-2026 జూన్ కు సంబంధించిన ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం విడుదల చేశారు. ఈ పరీక్షలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు 51 శాతం ఉత్తీర్ణత సాధించగా, సాధారణ అభ్యర్థులు 47 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ.. టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులందరికీ, ముఖ్యంగా ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. "ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు తమ అకడమిక్ నైపుణ్యాన్ని, నిబద్ధతను మరోసారి నిరూపించుకున్నారు. మీ కృషి, అంకితభావం ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయి" అని ఆయన ప్రశంసించారు. అదే సమయంలో, ఈసారి అర్హత సాధించలేకపోయిన అభ్యర్థులు నిరాశ చెందవద్దని లోకేశ్ భరోసా ఇచ్చారు. "విజయం అనేది ఒక గమ్యం కాదు, అదొక ప్రయాణం. కాబట్టి పట్టుదలతో ప్రయత్నిస్తూనే ఉండండి" అని వారికి ధైర్యం చెప్పారు. లక్ష్యసాధన కోసం కృషి కొనసాగించాలని సూచించారు. టెట్ ఫలితాలను అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ఖజ్ూవ్.ఖజూఎటం౦.అఅ ద్వారా తెలుసుకోవచ్చు. దీంతో పాటు, అభ్యర్థుల సౌలభ్యం కోసం 9552300009 అనే వాట్సాప్ నంబర్ ద్వారా కూడా ఫలితాలను పొందే సదుపాయాన్ని కల్పించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసి ఫలితాలను సులభంగా చూసుకోవచ్చు. ఉపాధ్యాయ నియామకాలకు టెట్ అర్హత తప్పనిసరి కావడంతో ఈ ఫలితాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది.

## ఆర్యవైశ్యులది ఆత్మగౌరవ జీవనం

ఆర్య వైశ్యులని, తానెప్పుడూ వారి శ్రేయోభిలాషినేనని చెప్పారు. ప్రపంచంలో ఉన్నవి రెండే వృత్తులని అవి వ్యవసాయం, వ్యాపారాలేనన్నారు. మాజీ ముఖ్యమంత్రులు చెన్నారెడ్డి నుంచి మొదలు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి వరకు గల్లాపెట్టె నిర్వహణ బాధ్యతను ఆర్యవైశ్యులకే అప్పగించారని గుర్తు చేశారు. జూన్ 2, 2014న తెలంగాణ ఏర్పాటు అయ్యేనాటికి రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉందంటే ఆనాటి ఆర్థికమంత్రి రోశయ్యే కారణం అన్నారు. శాసనమండలిలో దూకుడుగా తాను మాట్లాడితే రోశయ్య నన్ను పిలిచి ఆవేశం తగ్గించుకొని అనుభవంతో ముందుకు వెళ్తే పైకి వస్తావని ఆశీర్వదించారన్నారు. రోశయ్య విమర్శించే వారు కాదు..తిట్టేవారు కాదు..చురకలు వేసేవారు అని చెప్పారు. రాష్ట్రం విడిపోయినా రోశయ్య గౌరవాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో హైదరాబాద్ నడిబొడ్డున ఆయన విగ్రహం ఏర్పాటు చేశామన్నారు.

**ప్రపంచ స్థాయి నాయకుడు ఒకే ఒక్కరు మహాత్మాగాంధీ :** ప్రపంచస్థాయి నాయకుడు ఒకే ఒక్కరు మహాత్మాగాంధీ అని, ఏ దేశం పోయినా ఆయన గొప్పతనం తెలియనివారు ఉండరని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. భారతదేశం నుంచి ప్రపంచస్థాయి నాయకుడిగా ఎదిగిన ఆర్యవైశ్య బిడ్డ మహాత్మాగాంధీ అన్నారు. మహాత్మాగాంధీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కావడం గర్వ కారణమని చెప్పారు. పొట్టి శ్రీరాములు పోరాటం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. దేశ సమగ్రత కోసం మహాత్మాగాంధీ ప్రాణాలు ఇస్తే, పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, మాజీమంత్రి టీజీ వెంకటేశ్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, బండారి లక్ష్మారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, నవీన్‌యాదవ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, మాజీఎంపీ మధు యాష్కీ, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడిటోరియల్
EDITORIAL

# 'సర్' దుశ్చర్య!

దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పౌర పురస్కారం భారతరత్న. దేశానికి, సమాజానికి వివిధ రంగాల్లో అందించిన అసాధారణ సేవలకు ఇచ్చే అత్యున్నత గుర్తింపు. అలాంటి గౌరవాన్ని అందుకున్న ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్.రావుకు 'సర్' నోటీసులు రావడం దిగ్భ్రాంతికరం. తొంభై రెండేళ్ల వయసులో భారత శాస్త్రరంగానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన మహోన్నత శాస్త్రవేత్త పేరు ఓటర్ల జాబితాలోని పాత రికార్డుతో సరిపోలలేదనే కారణంతో సమస్యాత్మకంగా మారడం ఎన్నికల సంఘం పనితీరుపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. దేశవ్యాప్తంగా చర్చకు దారితీయడంతో కర్ణాటక ఎన్నికల సంఘం తప్పును ఎలా సరిచేయాలో మల్లగుల్లాలు పడుతోంది. మొదట ఆయన పేరు తప్పుగా ఉందని చెప్పి, ఇప్పుడు నోటీసులే ఇవ్వలేదని బుకాయిస్తోంది. కానీ ఆయన పేరు 'డిస్క్రెపెన్సీ' జాబితాలోకి ఎలా వచ్చిందన్న ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు. సి.ఎన్.ఆర్.రావు 'నేను భారత పౌరుడినే' అని నిరూపించుకోవాలా? 'నాకు భారతరత్న కూడా ఇచ్చారు, నన్ను గుర్తించండి' అంటూ వేడుకోవాలా? అసలు 'సర్' పేరుతో ఏం జరుగుతోంది దేశంలో? సి.ఎన్.ఆర్.రావు ఒక వ్యక్తి మాత్రమే కాదు. నిర్మాణాత్మక రసాయన శాస్త్రం, పదార్థాల శాస్త్రంలో ఆయన చేసిన పరిశోధనలు భారతదేశానికి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చాయి. దేశంలో శాస్త్ర పరిశోధనా సంస్థల అభివృద్ధికి, కొత్త తరాల శాస్త్రవేత్తల తయారీకి ఆయన చేసిన సేవలు అపారం. అందుకే దేశం 2014లో ఆయనను భారతరత్నతో గౌరవించింది. అలాంటి వ్యక్తి పేరు ఒక చిన్నపాటి రికార్డు తేడాతో అనుమానాల జాబితాలోకి రావడం భారతరత్న గౌరవానికే అవమానం. ఇక్కడ ప్రముఖులు, చిన్నవారు, పెద్దవారు అందరూ సమానమే కదా అన్న ప్రశ్న వస్తుంది. కానీ, అస్సాంలో 'సర్' చేపట్టినప్పుడు మయన్మార్ నుంచి వచ్చిన రోహింగ్యాలను ఏరివేయడానికేనని కేంద్రం చెప్పింది. తర్వాత బెంగాల్‌లో బంగ్లాదేశ్, బర్మా నుంచి వచ్చిన చొరబాటుదారుల కోసమనేని వాదించింది. ఇప్పుడు కర్ణాటకలో ఎవరున్నారు? తెలంగాణలోకి ఎవరు వచ్చారు? 'సర్' పేరుతో ప్రముఖులకు నోటీసులు పంపడం, వారు దేశానికి చేసిన సేవలను అవమానించడమే తప్ప వేరేకాదు. ఇది ఒక్క సి.ఎన్.ఆర్.రావు వ్యవహారంగా చూడలేం. పద్మశ్రీ గ్రహీత హారేకళ హాజబ్బా, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకణి కుటుంబం, జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ తదితర ప్రముఖుల పేర్లు కూడా 'సర్'లోని డిస్క్రెపెన్సీ లేదా మ్యాపింగ్ సమస్యల్లో చిక్కుకున్నాయి. హైదరాబాద్‌లో మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, నటుడు మహేశ్ బాబు, తదితరులకు 'సర్' నోటీసులు వచ్చినట్లు తాజా సమాచారం. ప్రముఖుల పేర్లు బయటకు రావడంతో ఈ వ్యవహారం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. ఇదంతా 'సర్' దుశ్చర్యలో ఓ భాగం మాత్రమే. అసలు సమస్య సామాన్య ఓటర్లది. కర్నాటకలోనే 43.81 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. పేరు మారడం, పాత రికార్డుతో వివరాలు సరిపోకపోవడం వంటి కారణాలతో పౌరులు తమ గుర్తింపును పదేపదే నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పత్రాలు అందజేసినా రశీదు ఇవ్వడం లేదని పలువురి ఆందోళనగా ఉంది. తెలంగాణలోనూ భారీ స్థాయిలో ఓటర్ల జాబితా సవరణ చేపట్టడం, ఇప్పటికే లక్షలాది పేర్లు తొలగింపు, మరికొందరికి నోటీసుల ప్రక్రియ ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. ఓటర్ల జాబితాలో తప్పులను సరిచేయడం అవసరమే. నకిలీ ఓట్లను తొలగించాల్సిందే. కానీ ఆ పేరుతో అసలైన ఓటర్లను తొలగించడం లేదా తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి పౌరులే అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి తలెత్తడం మాత్రం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. 'సర్' ప్రారంభానికి ముందే ఢిల్లీ ఎన్నికల సమయంలో పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించారన్నది ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తున్నది. ఇప్పుడు వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలపై తలెత్తుతున్న వివాదాలు చూస్తే 'సర్'ను కేవలం సాంకేతిక ప్రక్రియగా కొట్టిపారేయలేం. ముస్లింలు, దళితులు, గిరిజనులు, వలస కార్మికులు, పేదలు, బీజేపీ వ్యతిరేకులను లక్ష్యంగా చేసుకుని ఓట్లను ఏరి మరీ తీసేస్తున్నట్టు తెలుస్తోంది. కారణంగా ఏదో ఒక తప్పును వెతికి, దానికి కావాల్సిన ఆధారాలు చూపించమనడం వారిని ఓటుకు దూరం చేసే ఎత్తుగడనే! ఎన్నికల సంఘం కూడా దీనికి వంతపాడే విధానాలే అవలంభిస్తోందన్నవి 'సర్' ప్రారంభం నుంచి వస్తున్న విమర్శలే. దాని చర్యలు, నిర్ణయాలు ప్రతిపక్షాల్లోనే కాదు, ప్రజల్లోనూ అనుమానాలు కలిగిస్తున్నాయి. ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా, ఒక తొత్తులా వ్యవహరిస్తోందన్న విమర్శలకు తావివ్వకుండా తన స్వతంత్రతను నిరూపించుకోవడంలో అది విఫలమవుతోంది. అందుకే రాజ్యాంగబద్ధ సంస్థగా ఈసీపై ఉన్న విశ్వాసాన్ని కాపాడుకోవడం, ఓటర్లలో అభద్రతను తొలగించడం అత్యంత అవసరం. 'సర్' ప్రజాస్వామ్యాన్ని మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చే ప్రక్రియ కావాలి. కానీ అదే ప్రక్రియలో ఓటరే తన పౌరసత్వాన్ని, తన ఉనికిని, తన ఓటు హక్కును నిరూపించుకోవాల్సి వస్తే అది ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. భారతరత్న పొందిన శాస్త్రవేత్తకే తన పేరు నిరూపించుకోవాల్సిన పరిస్థితి వస్తే, సామాన్య ఓటరు పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తప్పక తలెత్తుతుంది. ఓటరు జాబితాను శుద్ధి' చేయడమే కాదు, ఓటు హక్కును కాపాడటమే ఎన్నికల సంఘం మొదటి బాధ్యత.

## సేవా కార్యక్రమాలతో ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు



**సిద్దిపేట, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య 72వ జన్మదిన వేడుకలు హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలంలో ఘనంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడు, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. సాయి కృష్ణ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు, బ్రెడ్ అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, బీసీల ఉద్యమ రథసారథి ఆర్.కృష్ణయ్య గత 50 ఏళ్లుగా నిరంతర పోరాటం చేస్తూ అనేక జీవోలు సాధించారని, సంక్షేమ వసతి గృహాలు, ఫీజు రీయింబర్స్మెంట్ పథకాలు ప్రవేశపెట్టేలా కృషి చేశారని తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం నాయకులు, సామాజిక కార్యకర్త డాక్టర్ వేల్పుల జయశంకర్, చేర్యాల మనోహర్, సాయి కృష్ణ హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాస్, పద్మశాలి సేవా సంఘం నేత నరాల శ్రీనివాస్, బీసీ మహిళా నాయకురాలు పి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుల పంపిణీ



**అమ్రాబాద్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట పట్టణంలో బిబిసి కళాంజలి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల ఉచిత పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా ప్రకృతిని రక్షించవచ్చని సూచించారు. భక్తితో పాటు బాధ్యత కూడా ముఖ్యమని, పర్యావరణహితంగా కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. "భక్తితో పూజిద్దాం... బాధ్యతతో ప్రకృతిని కాపాడుదాం" అనే సందేశం ప్రజల్లో చైతన్యాన్ని నింపిందని పేర్కొన్నారు.




## జాతీయ లోక్ అదాలత్‌లో 4,268 కేసుల పరిష్కారం

**కరీంనగర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను వేగవంతంగా పరిష్కరించేందుకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. 12 సెప్టెంబర్ 2026న జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 4,268 కేసులు పరిష్కరించబడ్డాయి. ఇందులో 451 ఎఫ్ఐఆర్ కేసులు, 1,019 వాహన ప్రమాదాలు, 2,798 మోటార్ వెహికల్ కేసులు ఉన్నాయి. కేసుల పరిష్కారంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన స్టేషన్లలో కరీంనగర్ ట్రాఫిక్ 685, × టౌన్ 495, ×× టౌన్ 344, ××× టౌన్ 275, రూరల్ 246 కేసులు పరిష్కరించాయి. తక్కువ కేసులు పరిష్కరించిన స్టేషన్లలో మహిళా పోలీస్ స్టేషన్ 17, సైదాపూర్ 76, వీణవంక 105, గన్నేరువరం 121, గంగాధర 131 ఉన్నాయి. సైబర్ నేరాలకు సంబంధించిన 29 ఎఫ్ఐఆర్ కేసులు, 5 నాన్–ఎఫ్ఐఆర్ కేసులు కూడా పరిష్కరించబడ్డాయి. కేసుల సత్వర పరిష్కారానికి సహకరించిన న్యాయ వ్యవస్థ, పోలీస్ అధికారులు, సిబ్బందికి కమిషనరేట్ అభినందనలు తెలిపింది. కేసులను సకాలంలో పరిష్కరించేందుకు నిరంతరం సమన్వయంతో చర్యలు కొనసాగుతాయని సీపీ గౌష్ ఆలం తెలిపారు.

## పీఆర్టీయూ టీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ఎలిగేడు, సెప్టెంబరు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల పీఆర్టీయూ టీఎస్ శాఖ సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షుడు మిట్టపల్లి యుగేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆర్థిక కార్యదర్శి సముద్రాల చంద్రమౌళి నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ నిర్మాణం, ప్రాధాన్యత, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం 2026--27 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మిట్టపల్లి యుగేందర్ వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సముద్రాల చంద్రమౌళి, సహాధ్యక్షుడిగా గుడికందుల ప్రసాద్, మహిళా సహాధ్యక్షురాలిగా బి.రమాదేవి, ఉపాధ్యక్షుడిగా మూసం భాస్కర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా బూర లావణ్య, కార్యదర్శిగా ఎస్.రవీందర్‌రావు, మహిళా కార్యదర్శిగా భారతి, నిర్వహణ కార్యదర్శిగా సుధాకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు యుగేందర్ మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల



పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు గండు కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్, ఎన్నికల అధికారిగా వై.మహేశ్వరులు హాజరయ్యారు. పుల్లల శ్రీధర్, శ్రీశైలం, సత్యనారాయణ, చంద్రశేఖర్, బాబుతో పాటు ఉపాధ్యాయులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానించిన చిన్ననాటి స్నేహితులు



**ఎలిగేడు, సెప్టెంబరు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు వ్యవసాయ మార్కెట్ కమిటీ తొలి చైర్మన్‌గా ఎన్నికైన రమేశ్‌ను ఆయన పదో తరగతి బ్యాచ్ చిన్ననాటి స్నేహితులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమేశ్‌కు పూలమాల వేసి, శాలువాతో సత్కరించారు. అతి చిన్న వయస్సులోనే ఎలిగేడు తొలి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తమ తరగతి మిత్రుడు ఎన్నిక కావడం ఎంతో సంతోషంగా ఉందని స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారు. ఆయన పదవిలో విజయవంతంగా కొనసాగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్నేహితులు మామిడాల కిరణ్, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్, సతీష్, శ్రీనివాస్, రాము, చారి, శేఖర్, మోహన్, శ్రావణ్, కప్పల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన కరాటే ఛాంపియన్‌షిప్ -2026 పోటీలు

**కరీంనగర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హౌసింగ్ బోర్డ్ రోడ్డులోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన సూపర్ ఫైటర్స్ కరాటే ఛాంపియన్‌షిప్--2026 పోటీలు అంగరంగ వైభవంగా ముగిశాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 466 మంది బాలురు, బాలికలు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. అకాడమీ



చీఫ్ సురభి వేణుగోపాల్ మాట్లాడుతూ క్రీడలు యువతలో చెడు అలవాట్లను దూరం చేసి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, ముఖ్యంగా ఆడపిల్లలకు కరాటే శిక్షణ అవసరమని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కె.ఏ.పి.పి. చంద్ర, తోట అనిల్‌కుమార్, సెయింట్ పాల్స్ స్కూల్ ప్రతినిధులు లీనా ప్రియదర్శిని--రాజ్‌కుమార్, వాటర్ ప్లాంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె. రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ సెన్సాయ్ సింగం వినేష్ పర్యవేక్షణలో పోటీలు విజయవంతంగా ముగిశాయి.

## ఘనంగా మాదిగల ఆత్మీయ సమావేశం

**జమ్మికుంట, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జమ్మికుంట పట్టణంలోని ఎంపీర్ గార్డెన్‌లో మాదిగ మహాశక్తి ఆధ్వర్యంలో మాదిగల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ ప్రణవ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమాజ ఐక్యత, అభివృద్ధి లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించబడింది.





# ధూళికట్టలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



**ఎలిగేడు, సెప్టెంబరు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వినాయక చవితిని పురస్కరించుకుని ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలో ఆదివారం మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘ నాయకుడు మాదూరి మల్లేశం ఆధ్వర్యంలో ముందస్తుగా మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను భక్తులకు అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలుసాని పరశురాములుగౌడ్, పాత మారుతి, మాదూరి మల్లేశం, నరినేని సుధాకర్‌రావు, దీరకొండ తిరుపతి, కాల్వ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సవాల ఊరేగింపులకై ట్రాలీ విరాళం



**ఖానాపూర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** విద్యానగర్‌లో శ్రీ వినాయక, శ్రీ దుర్గామాత ఉత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవారి ఊరేగింపుల కోసం శాశ్వత ట్రాలీని ఎనుగందుల భూమన్న, ఎనుగందుల రమణయ్య, ఎనుగందుల నారాయణ తమ తండ్రి స్వర్గీయ ఎనుగందుల బుచ్చన్న జ్ఞాపకార్థంగా స్వంత ఖర్చుతో తయారు చేసి యూత్ కమిటీకి అందజేశారు. ఉత్సవాల సమయంలో వాహనాల ఏర్పాట్లలో ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా ఊరేగింపులు నిర్వహించేందుకు ఈ ట్రాలీ ఉపయోగపడుతుందని కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. రమణయ్య మాట్లాడుతూ ప్రతి ఏడాది గణపతి నవరాత్రి, దుర్గామాత ఉత్సవాల అనంతరం నిమజ్జన కార్యక్రమాల్లో ఇబ్బందులు ఎదురవుతాయని, ట్రాలీ వల్ల సమస్యలు తొలగాయని తెలిపారు. ఉత్సవాల అనంతరం దీన్ని జాగ్రత్తగా కాపాడాలని నిర్వాహకులను కోరారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలోఎన్‌సీడీ స్క్రీనింగ్ నిర్వహణ



**ఖానాపూర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో పెంబి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీడీ (అసంక్రమణీయ వ్యాధులు) స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు రక్తపోటు, మధుమేహం తదితర పరీక్షలు చేశారు. వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స పొందితే ఆరోగ్య సమస్యలను నియంత్రించవచ్చని వైద్య సిబ్బంది సూచించారు. ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల మల్లేష్, ఉప సర్పంచ్ ఓరగంటి రాజేశ్వర్, ఏఎన్‌ఎం స్వాతి, హెచ్‌ఏ రాజేశ్వర్, ఆశా కార్యకర్త కమల తదితరులు పాల్గొన్నారు.

# పిఎసిఎస్ వైస్ చైర్మన్ కరిపె శ్రీనివాస్ మనుమరాలు పుట్టినరోజు వేడుకల్లో జాన్సన్ నాయక్



**ఖానాపూర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో పిఎసిఎస్ వైస్ చైర్మన్ కరిపె శ్రీనివాస్ మనుమరాలు, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు నవాత్ కృష్ణంరాజు--రజిత దంపతుల కుమార్తె ఇషాన్వి ప్రథమ పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ హాజరై చిన్నారి ఇషాన్విని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎలిగేడు మండల పెయింటర్ల నూతన కార్యవర్గం ఎన్నిక



**ఎలిగేడు, సెప్టెంబరు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల పెయింటర్ల నూతన కార్యవర్గాన్ని ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కాశిపాక వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడిగా కాంపెల్లి ప్రభాకర్, మండల ఇన్‌చార్జిగా రాసూరి శేఖర్, ఉపాధ్యక్షుడిగా తీట్ల అనిల్‌కుమార్, కోశాధికారిగా ఇరుగురాల రవేశ్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కవ్వంపల్లి మహేశ్, కార్యదర్శిగా ఇరుగురాల కుమార్, ప్రచార కార్యదర్శిగా సామనపల్లి అనిల్, సలహాదారుగా కల్వల అనిల్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఇరుగురాల అజయ్, ఇరుగురాల రవి (సచిన్), కవ్వంపల్లి రామ్, కప్పల మహేశ్, కోడిపెల్లి కనుకరాజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ మండలంలోని పెయింటర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పెయింటర్ల సంక్షేమం, ఐక్యత కోసం కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు.

# వినాయక నవరాత్రోత్సవాలకు ముస్తాబైన మండపాలు

**ఎలిగేడు, సెప్టెంబరు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వినాయక చవితిని పురస్కరించుకుని నవరాత్రోత్సవాలకు ఎలిగేడు మండలం ముస్తాబైంది. మండలంలోని గ్రామాలు, వీధులు, వాడల్లో గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు మండపాలను సిద్ధం చేశారు. మండపాలను అందంగా తీర్చిదిద్ది రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.



సోమవారం ఆయా మండపాల్లో విఘ్నేశ్వరుడి విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రి పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఉత్సవాల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు.

# అడవి పందుల దాడితో తీవ్ర పంట నష్టం



**ఖానాపూర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలం ఎర్వచింతల్ గ్రామానికి చెందిన రైతు కోడారి సత్తన్న సుమారు ఎకరం మొక్కజొన్న పంట అడవి పందుల దాడిలో ధ్వంసమైంది. చేతికొచ్చిన పంటను పందులు నాశనం చేయడంతో వేల రూపాయల నష్టం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

# మహాశక్తి ఆలయంలో ఘనంగా జరగనున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

**కరీంనగర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీ మహాశక్తి ఆలయంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు రేపటి నుండి తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం -సాయంత్రం ప్రత్యేక పూజలు, సహస్ర మోదక గణపతి హోమం నిర్వహించనున్నారు. భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. గత 16 ఏళ్లుగా



సంప్రదాయబద్ధంగా జరుగుతున్న ఈ ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, సామూహికతకు ప్రతీకగా నిలుస్తున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వర్గాల ప్రజలు పాల్గొననున్నారు. ఈ నెల 23న గణేశ్ నిమజ్జనం ఘనంగా జరగనుంది. ఆ రోజు ప్రత్యేక హోమ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొననున్నారు. ఆలయ నిర్వాహకులు హిందూ బంధువులందరూ ఉత్సవాల్లో పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందాలని విజ్ఞప్తి చేశారు.

# 50 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరిన బాల్య మిత్రులు

## 64-66 ఏళ్ల వయస్సులోనూ తగ్గని స్నేహబంధం.. తీపి జ్ఞాపకాలతో సందడి





**ఎలిగేడు, సెప్టెంబరు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఐదు దశాబ్దాల తర్వాత బాల్య మిత్రులంతా ఒక్కచోట కలుసుకోవడంతో ఎలిగేడు మండలంలోని మధురమ్మ ఫంక్షన్ హాల్ ఆదివారం ఆత్మీయతకు వేదికగా మారింది. 1976--77 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అర్ధ శతాబ్ది ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థి దశలో కలిసి చదువుకున్న సుమారు 40 మంది మిత్రులు ఐదు దశాబ్దాల అనంతరం ఒకరినొకరు కలుసుకోవడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ప్రస్తుతం 64 నుంచి 66 ఏళ్ల వయస్సులో ఉన్నప్పటికీ వ్యక్తిగత పనులను పక్కనపెట్టి ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులు ఒకే వేదికపై కలుసుకుని చిన్ననాటి అల్లరి, చదువుకున్న రోజులు, ఉపాధ్యాయులతో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకున్నారు. "ఐదు దశాబ్దాలు గడిచినా.. స్నేహానికి వయస్సు లేదు" అన్నట్లుగా మిత్రులంతా చిన్ననాటి జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయారు. గంటల తరబడి ఆత్మీయంగా ముచ్చటించుకుంటూ తమ కుటుంబ, జీవిత విశేషాలను పరస్పరం పంచుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రుల ముఖాల్లో కనిపించిన ఆనందం, ఆత్మీయత కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సమ్మేళనం తమలో నూతన ఉత్సాహాన్ని నింపిందని, భవిష్యత్తులోనూ ఇలాంటి ఆత్మీయ కలయికలు నిర్వహించుకోవాలని పూర్వ విద్యార్థులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు కరివేద రాజిరెడ్డి, బోడ మల్లారెడ్డితో పాటు నిర్వాహకులు బుర్ర జగదీశ్వర్‌గౌడ్, కేశెట్టి విద్యాసాగర్, ఏలేటి రాజేశ్వర్‌రెడ్డి, దుగ్యాల భూమ్‌రావు, హరికృష్ణంరాజు, బత్తిని రాజేశంగౌడ్, దేవేందర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ కప్పల ప్రవీణ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కోరుకంటి వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మండిగ రేణుక రాజనరసయ్య, మాజీ ఎంపీటీసీ బూర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల భవన అభివృద్ధికి దాతల సహకారం



**ఖానాపూర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నిర్మల్ జిల్లా కడెం మండలంలోని జెడ్పీ హెచ్‌ఎస్ లింగాపూర్ పాఠశాల విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కొత్త తరగతి గదుల నిర్మాణానికి స్థలం కొనుగోలు చేశారు. మేధ ట్రస్ట్ ఇప్పటికే రెండు సంవత్సరాల క్రితం రెండున్నర కోట్లతో ఆరు తరగతి గదులు, కిచెన్ హాల్, బాలురు--బాలికల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు, శుద్ధి చేసిన తాగునీటి సదుపాయం ఏర్పాటు చేసింది. ఈ విద్యా సంవత్సరంలో మరో ఆరు తరగతి గదుల నిర్మాణానికి ఒక కోటి రూపాయలు మంజూరు చేసింది. అయితే పాఠశాల భవనం నిర్మాణానికి స్థలం లేకపోవడంతో, గ్రామ సర్పంచ్ కుమ్మరి రంజిత్ ఆధ్వర్యంలో పాఠశాల పక్కన గల స్థలాన్ని రూ. 8 లక్షలతో కొనుగోలు చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో విరాళాలు సేకరించారు. లింగాపూర్ విద్యార్థులు ప్రతిభతో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తూ మేధ ట్రస్ట్ ఉచిత ఇంటర్ విద్యకు ఎంపిక అవుతున్నారని అధికారులు తెలిపారు.

# ధన్వి న్యూట్రిషన్ సెంటర్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



**పెద్దపల్లి, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య సూచించారు. ఆదివారం రంగంపల్లి ప్రాంతంలో ధన్వి న్యూట్రిషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అధిక బరువు, ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయని, వీటి నియంత్రణకు సమతుల్య ఆహారం, పోషకాహారం, క్రమబద్ధమైన జీవనశైలి అవసరమని తెలిపారు. ప్రారంభోత్సవంలో ప్రజలకు ఉచిత బీఎమ్ఐ చెకప్, బరువు పరిశీలన నిర్వహించారు. పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కేంద్రం నిర్వాహకులు ప్రజలకు వ్యక్తిగత ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా పోషకాహార మార్గదర్శకత్వం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పూదరి అనుష మహేందర్, అక్కెపల్లి క్రాంతికుమార్, పూదరి చంద్రశేఖర్, రత్నం, ఈర్ల సురేందర్, తోట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కరాటే పోటీల్లో మెడల్స్ సాధించిన బీర్‌నంది విద్యార్థులు



**ఖానాపూర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర స్థాయి సూపర్ ఫైటర్స్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో బీర్‌నంది విద్యార్థులు మెడల్స్ సాధించారు. జెడ్‌పీ హెచ్‌ఎస్ బీర్‌నంది విద్యార్థి బి. రిశ్వంత్ గోల్డ్ మెడల్, బీర్‌నంది ప్రైమరీ స్కూల్‌కు చెందిన ఎం. అక్షర గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. తెలంగాణ సూపర్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ స్టేట్ ప్రెసిడెంట్ సురభి వేణుగోపాల్, మాస్టర్ ఎం. మనోహర్ ఈ విజయాలను ప్రకటించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ఎల్.వి. లక్ష్మీ వరప్రసాద్, ఉపాధ్యాయులు ఏం. ప్రకాష్, రవీందర్ విద్యార్థులను అభినందించారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్, డిప్యూటీ మేయర్



**కరీంనగర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ హస్నాపూర్ ప్రాంతంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న హెచ్‌డీపీఈ పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, స్థానిక కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ--వేణు పాల్గొన్నారు. ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడమే లక్ష్యంగా పనులను చేపడుతున్నామని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా

**ఖానాపూర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఈ ఏడాది గణేష్ మండపాలకు ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉచిత విద్యుత్ అందజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. మండపాల వద్ద సర్వీస్ వైర్ నుంచి కనెక్షన్ తీసుకోవాలని, ఎలాంటి కొక్కీలు లేదా జాయింట్లు లేకుండా నాణ్యమైన స్విచ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మండపం వద్ద విద్యుత్ అవసరాల కోసం ప్రత్యేక వ్యక్తిని నియమించాలని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉచిత విద్యుత్ వలన భక్తులు ఆనందం వ్యక్తం చేస్తూ, వినియోగం సక్రమంగా ఉండేలా చూసుకోవాలని అధికారులు కోరారు.

సోమవారం
14 సెప్టెంబర్
2026

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# నూతన గ్రంథాలయాన్ని వెంటనే ప్రారంభించాలి : డీవైఎఫ్ఐ




**కరీంనగర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిరుద్యోగ యువత, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం నిర్మించిన నూతన గ్రంథాలయాన్ని వెంటనే ప్రారంభించాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం కమిటీ సభ్యులు గ్రంథాలయాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నరేష్ పటేల్ మాట్లాడుతూ ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడుతున్న నేపథ్యంలో అభ్యర్థుల సంఖ్య పెరుగుతోందని, పాత గ్రంథాలయంలో స్థలాభావం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, పత్రికలు, డిజిటల్ లైబ్రరీ, ఇంటర్నెట్, తాగునీరు, మరుగుదొడ్లు, మహిళా అభ్యర్థులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు. గ్రంథాలయాన్ని ఆధునిక స్టడీ సెంటర్‌గా అభివృద్ధి చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, కమిటీ సభ్యులు తిరుపతి, అరవింద్, వెంకటేష్, శిరిప్రసాద్, విష్ణు, శివ, సురేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఓటర్ల జాబితాలో ఒక్క అనర్హుడి పేరు లేకుండా, ఒక్క అర్హుడి పేరు గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. ఎస్ఐఆర్--2026 (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఓటర్ల వివరాల పరిశీలనలో పొరపాట్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.జిల్లాలో 2,24,263 మంది ఓటర్లకు నోటీసులు అందజేసి, దాదాపు లక్ష మంది సమాధానాలు ఇచ్చినట్లు తెలిపారు. కొత్తగా ఓటరు నమోదు, పేరు తొలగింపు, సవరణలకు సంబంధించిన ఫారాలు (ఫారం--6, 7, 8) ఎలాంటి పెండింగ్ లేకుండా పరిశీలించాలని తహసీల్దార్లను ఆదేశించారు.బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పనులను క్రాస్ వెరిఫికేషన్ చేయాలని, నిర్లక్ష్యం వహించే వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రతి ఓటరు తన పేరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని, తప్పులు ఉంటే వెంటనే ఎన్నికల సిబ్బందికి తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఓటర్ల సహకారంతోనే పారదర్శకమైన, దోషరహిత జాబితా సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ డిమాండ్



**కమాన్‌పూర్/ రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సెప్టెంబర్ 17, 1948 తెలంగాణ విమోచన చరిత్రలో అత్యంత కీలకమైన రోజు అని బీజేపీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాజీ మొలుమూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. రామగిరి మండలం సెంట్‌నరి కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ పోలో అనంతరం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని, ఈ చారిత్రక ఘట్టాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం సెప్టెంబర్ 17ను "ప్రజా పాలన దినోత్సవం"గా నిర్వహిస్తోందని, బీజేపీ తరఫున ఇది "తెలంగాణ విమోచన దినోత్సవం"గా అధికారికంగా గుర్తించాలన్న డిమాండ్ స్పష్టంగా ఉందని ఆయన తెలిపారు. అమరవీరుల కుటుంబాలను సన్మానించాలని, విమోచన పోరాట చరిత్రను విద్యార్థులకు బోధించాలని, చారిత్రక ప్రదేశాలను అభివృద్ధి చేసి స్మారక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.



రాజన్న సిరిసిల్లలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి కూడా ఇదే డిమాండ్ చేశారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా విస్మరిస్తున్నాయని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించి, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి మహనీయుల త్యాగాలను భావితరాలకు చాటి చెబుతామని రెడ్డబోయిన గోపి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర నాయకులు ఎర్రం మహేష్, లింగంపల్లి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతిరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బర్కం లక్ష్మీ, శీలం రాజు, ఇతర జిల్లా నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుల వేతనాలపై సీఐటీయూ తీవ్ర విమర్శలు



**కరీంనగర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గ్రామ పంచాయతీ కార్మికులకు ఎనిమిదేళ్లుగా జీతాలు పెంచకపోవడం శ్రమదోపిడిగా మారిందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ విమర్శించారు. సైదాపూర్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కార్మికులు పొందుతున్న రూ.9,500 వేతనంతో కుటుంబాలు బ్రతకలేవని, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా రూ.20 లక్షలు కల్పించాలని కోరారు.జీతాల చెల్లింపులో సర్పంచులు, కార్యదర్శులు ఒకరి మీద ఒకరు నెపం నెట్టడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. పెరిగిన పని భారం, అనారోగ్యం, శుభకార్యాల కారణంగా హాజరు కాని కార్మికుల జీతాల్లో కోతలు విధించడం అన్యాయమని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ములుగురి ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షులు తలగంప రాములు, బోయిని స్వరూప, జంగా చంద్రయ్య, సారయ్య, కమిటీ సభ్యులు మాతంగి సదానందం, బొడిగ సంపత్, ఎండి మొయినుద్దీన్, కల్వల బాపూరావు, కాశిపాక ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి : పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన వేడుకలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ బందోబస్తు చర్యలు చేపట్టామని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు.కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ కెమెరాలతో నిమజ్జన మార్గాలు, సమస్యాత్మక ప్రాంతాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని చెప్పారు. ప్రతి మండపంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాలంటీర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు.మానకొండూరు, కొత్తపల్లి, చింతకుంట వంటి ప్రధాన నిమజ్జన ఘాట్ల వద్ద పటిష్ట బందోబస్తు, భారీ క్రేన్లు, లైటింగ్, స్విమ్మర్లు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఊరేగింపుల మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు రూట్ మ్యాప్ అమలు చేస్తున్నామని చెప్పారు.సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే 'డయల్ 100' ద్వారా సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.భక్తిశ్రద్ధలతో, చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని కమిషనర్ గౌష్ ఆలం కోరారు.

# పర్యావరణహిత మట్టి వినాయకుల పంపిణీ





కరీంనగర్ పట్టణం, గన్నేరువరం మండలంతో పాటు పలు ప్రాంతాల్లో మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.కరీంనగర్‌లో యువ సంకల్పం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాలిపెల్లి కుమార్ మట్టి వినాయకులను అందజేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నీటి వనరులను కలుషితం చేస్తాయని, పర్యావరణానికి మట్టి వినాయకులే మేలు అని ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ పలు డివిజన్లలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. భగత్‌నగర్, చింతకుంట, చైతన్యపురి కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో ప్రజలకు విగ్రహాలను అందజేశారు. పర్యావరణహితమైన వినాయక చవితి జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో శాస్త్రి రోడ్డులో 500 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని తోడుపునూరి కార్తీక్ తన కుమార్తె శిఖర చంద్రిక పుట్టినరోజు సందర్భంగా నిర్వహించడం విశేషం.భగత్‌నగర్‌లో ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కొల్లూరు హరిప్రసాద్ మట్టి వినాయకులను పంపిణీ చేశారు. తల్లిదండ్రుల సేవే మాధవ సేవ అని ఆయన పేర్కొన్నారు. గన్నేరువరం మండల కేంద్రంలో సొల్లు అజయ్ వర్మ, రంగనవేని లచ్చినర్సు, బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ కలిసి మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. రసాయన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం అవుతాయని, మట్టి వినాయకుల వినియోగమే పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని వారు అన్నారు.ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, సంఘ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మట్టి వినాయకులను స్వీకరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని నిర్వాహకులు ప్రజలకు పిలుపునిచ్చారు.

# పద్మశాలి కార్పొరేటర్లకు ఘన సన్మానం



**కరీంనగర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అఖిలభారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ నారాయణగూడలోని పద్మశాలి భవనంలో ఇటీవల ప్రజాప్రతినిధులుగా గెలుపొందిన మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు రాష్ట్రస్థాయి సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాకు చెందిన కార్పొరేటర్లు వాసాల రమేష్, మాసం గణేష్, వేముల కవితా చంద్రశేఖర్, దేవసాని సరస్వతి సత్యనారాయణ, చొప్పరి జయశ్రీ వేణు, తెల్ల లక్ష్మి రమేష్‌లను ఘనంగా సత్కరించారు. పద్మశాలి సంఘం కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్, హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ దూడం వెంకటరమణ, అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు కమర్తపు మురళి, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు తదితరులు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు, శాలువాలతో సత్కరించారు.పద్మశాలి సమాజానికి మరింత సేవ చేయాలని, రాజకీయంగా రాణించాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెతుకు సత్యం, వోల్లాల కృష్ణహరి, అలుస భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే ఊరుకోనని బొంకూరి కైలాసం హెచ్చరిక




**పెద్దపల్లి, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తనపై వ్యక్తిగత ద్వేషంతో అసత్య ప్రచారం జరుగుతోందని మహనీయుల ఆశయ సాధన సంఘం అధ్యక్షుడు బొంకూరి కైలాసం అన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే కోర్టు నోటీసులు పంపిస్తానని ఆయన హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకుల ఏకపక్ష తీరు కారణంగా తాను ఆ సంఘం నుండి బయటకు వచ్చి మహనీయుల ఆశయ సాధన సంఘాన్ని ఏర్పాటు చేశానని తెలిపారు. తన వ్యాఖ్యల వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిన్నట్లయితే క్షమించాలని కోరారు.ఉద్యోగాల స్కామ్‌తో తనకు సంబంధం లేదని, గుండారం ప్రాంతంలో తలెత్తిన వివాదంలో బాధితులకు తన సొంత డబ్బులు 90 వేల రూపాయలు చెల్లించానని వివరించారు. గోదావరిఖని ప్రాంతంలో పేద కార్మికులను నమ్మించి దాదాపు 10 కోట్ల రూపాయలు వసూలు చేసినది ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులేనని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.తనపై ఆరోపణలు చేస్తున్న వారు ధైర్యముంటే ఆధారాలను పోలీసులకు అప్పగించాలని, లేకపోతే పత్రికా సమావేశాల్లో కించపరిచేలా మాట్లాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. తనకు ప్రాణహాని కలిగితే దానికి పూర్తి బాధ్యత మామిడిపల్లి బాపయ్య, బొంకూరి మధు, లంక సదయ్యలదేనని కైలాసం స్పష్టం చేశారు.

# పేదల కళ్లలో వెలుగులు నింపుతున్న సేవ

**మూడో రోజు 850 మందికి పైగా రాక..**

**550 మందికి కంటి పరీక్షలు, 320 మందికి అద్దాల పంపిణీ**





**ఆమనగల్లు, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత కంటి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్విరామంగా కొనసాగుతోంది. కడ్తాల్‌లో నిర్వహిస్తున్న ఈ శిబిరానికి మూడో రోజు ఆదివారం ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 850 మందికి పైగా ప్రజలు శిబిరాన్ని సందర్శించగా, 550 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన 320 మందికి పైగా ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. కంటి శుక్లాలతో బాధపడుతున్న 28 మందిని గుర్తించి, వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఎంపిక చేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలకు వైద్య పరీక్షలతో పాటు అవసరమైన అద్దాలు, శస్త్రచికిత్సలను ఉచితంగా అందించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నిరుపేదలకు మెరుగైన కంటి వైద్యం అందించడంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా శిబిరాన్ని కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం కొనసాగుతోంది.

# మహిళల నాయకత్వాన్ని బలపరచాలని పిలుపు

**పాములపాడు, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మహిళలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని హక్కుల కోసం జరిగే ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలని మాదిగ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నందిని మాదిగ పిలుపునిచ్చారు.మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పాములపాడులో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం, చట్టాలపై అవగాహన అవసరమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను కలుపుకొని రాజ్యాధికార సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు.ఈ సందర్భంగా పాములపాడు మండల మహిళా కమిటీని ప్రకటించారు. కన్వీనర్‌గా నులక భారతి మాదిగ, కో-కన్వీనర్‌గా కర్నాటి ప్రియాంక



మాదిగతో పాటు లావణ్య, దుర్గమ్మ, లక్ష్మీదేవిలను నియమించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రేమ రాజు మాదిగ, రాంప్రసాద్ మాదిగ, బుల్లెద్దుల మోహన్ పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలన్న సిపిఎం డిమాండ్



**కరీంనగర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే వరిష్కరించాలని, ఇండస్ట్రీపై ఆధారపడ్డ కార్మికులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్ల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎఫ్సీఐ గోదాముల్లో తగిన నిల్వ స్థలం కల్పించి, సీఎంఆర్ బియ్యం సకాలంలో లిఫ్టింగ్ చేయాలని కోరారు. మిల్లింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, పెరిగిన నిర్వహణ ఖర్చులకు అనుగుణంగా మిల్లింగ్ చార్జీలు పెంచాలని, 25 శాతం పెనాల్టీ, వడ్డీ భారాన్ని మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్ పరిశ్రమ మూతపడితే రైతులు, కార్మికులు, డ్రైవర్లు, దినసరి కూలీలు, హమాలీలు వంటి వేలాది మంది ఉపాధి కోల్పోతారని ఆయన హెచ్చరించారు. మిల్లర్లతో ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వాసుదేవరెడ్డి కోరారు.

## మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



**బోడుప్పల్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాజీవ్‌నగర్ కాలనీలో 13వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దానగాళ్ల అనిత యాదగిరి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను పూజించాలని ఆమె కోరారు. కాలుష్య రహిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ పర్యావరణహిత విగ్రహాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గోపు రాములు, నానాజీ, గడ్డి రమేష్, నాగరాజు, చిప్పల శ్రీధర్, రాజగోపాల్, రాజేష్, కిశోర్, సాయికిరణ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## కాలం మారినా.. స్నేహం మారలేదు

### 1982--83 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ఆమనగల్లు, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాలం మారినా చిన్ననాటి స్నేహబంధాలు చెరిగిపోవని నిరూపిస్తూ ఆమనగల్లు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1982--83 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. కడ్తాల్ మండల కేంద్రంలోని ఫామ్‌హౌస్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాలలో కలిసి చదువుకున్న రోజులు, ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధం, అప్పటి స్నేహాలు, సరదా సంఘటనలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ తమ కుటుంబ, ఉద్యోగ, జీవిత విశేషాలను పరస్పరం పంచుకున్నారు. ఇంతకాలం తర్వాత పాత మిత్రులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, బాల్యంలో కలిసి గడిపిన తీపి జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకోవడం మరిచిపోలేని అనుభూతిగా ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తూ తమ స్నేహబంధాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో 1982--83 బ్యాచ్‌కు చెందిన పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏఐపిసి బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానన్న కమ్మగోని చౌదరి గౌడ్



**పెద్దపల్లి, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కమ్మగోని చౌదరి గౌడ్, హైదరాబాద్‌లో ఏఐపిసి జాతీయ చైర్మన్ మధు యాష్కీ గౌడ్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో సంస్థాగత పురోగతి, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. చౌదరి గౌడ్ మాట్లాడుతూ మధు యాష్కీ గౌడ్ మార్గదర్శకత్వంలో ఏఐపిసిని జిల్లా వ్యాప్తంగా విస్తరించి, ప్రతి స్థాయిలో బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. వృత్తినిపుణులను ప్రజాసేవ వైపు మళ్లించి, ప్రజా సమస్యల పరిష్కారానికి వినూత్న కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఏఐపిసి ప్రజల్లో, వృత్తినిపుణుల్లో విశ్వసనీయతను పెంచుతూ కొత్త శిఖరాలను అధిరోహిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## విషాద కుటుంబానికి ఆర్థిక భరోసా

### బాధిత కుటుంబానికి అండగా నిలిచిన సర్పంచ్ కూరాకుల చినరామయ్య



**అడవిదేవులపల్లి, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అనారోగ్యంతో మృతి చెందిన సిగపట్ల వెంకటేశ్వర్లు కుటుంబానికి అడవిదేవులపల్లి గ్రామ సర్పంచ్ కూరాకుల చినరామయ్య అండగా నిలిచారు. విషయం తెలుసుకున్న ఆయన మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. విషాద సమయంలో బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని సర్పంచ్ చినరామయ్య హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు బండి ఆంజనేయులు, గ్రామ పెద్ద రాపోలు పుల్లయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక ప్రతిమల అందజేత

### ఎమ్మెల్యే కసిరెడ్డి దంపతులకు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డికి బహూకరణ





**ఆమనగల్లు, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ మట్టి వినాయక ప్రతిమలను బహూకరించారు. ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాధవి దంపతులకు నాయకులతో కలిసి మట్టి వినాయక ప్రతిమను అందజేశారు. అనంతరం ఏఐసీసీ సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డికి కూడా మట్టి వినాయక ప్రతిమను అందించారు. ఈ సందర్భంగా అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకల్లో మట్టి వినాయక ప్రతిమలను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణహితంగా పండుగను నిర్వహించాలని సూచించారు. మట్టి విగ్రహాల వినియోగం వల్ల చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడుకోవచ్చన్నారు. సంప్రదాయ పండుగలను పర్యావరణహితంగా నిర్వహించడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు బాటలు వేయవచ్చని తెలిపారు. ప్రజలు మట్టి వినాయక ప్రతిమలనే వినియోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ఫరీద్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలతో మారుతున్న గ్రామాల రూపురేఖలు

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో పోల్‌సింగ్ ప్రజాప్రతినిధుల కాంగ్రెస్‌లో చేరిక



**ఆమనగల్లు, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. ఆదివారం తన నివాసంలో తలకొండపల్లి మండలం పోల్‌సింగ్ గ్రామపంచాయతీకి చెందిన సర్పంచ్ శ్రీను, ఉపసర్పంచ్ సురేష్, వార్డు సభ్యులు శంకర్, లక్ష్మణ్, ట్రైలర్ శ్రీను, గోపాల్, ఏస్లావత్ శ్రీను, శ్రీను తిరుపతి తదితరులను కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందించడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీలో చేరిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, పోల్‌సింగ్ గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రఘురాములు, రామలక్ష్మణ్, రాఘవేందర్, రాజేందర్ మరియు మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినాయక చవితికి సిద్ధమైన వినాయక మండపాలు

### గణనాథుడి ప్రతిష్ఠాపనకు ముస్తాబైన పట్టణం.. పండుగ సందడికి సిద్ధమైన భక్తులు





**ఆమనగల్లు, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో గణనాథుడి ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వివిధ కాలనీలు, ప్రధాన కూడళ్లు, వీధుల్లో యువజన సంఘాలు, భక్తులు ప్రత్యేకంగా వినాయక మండపాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు, రంగురంగుల అలంకరణలతో ముస్తాబు చేశారు. ఆదివారం రాత్రి వరకు మండపాల ఏర్పాట్లు, అలంకరణ పనుల్లో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. సోమవారం ఉదయం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక నవరాత్రులను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు యువత ఉత్సాహంగా ఏర్పాట్లు చేస్తోంది. పండుగ సందర్భంగా మండపాల వద్ద ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, హారతులు, భజనలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. చిన్నారులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఆమనగల్లు పట్టణంలో వినాయక చవితి పండుగ సందడి నెలకొంది.

## మట్టి వినాయకుడినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం

### కల్వకుర్తి ప్రజలకు ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పిలుపు



**ఆమనగల్లు, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వినాయక చవితిని పర్యావరణహితంగా జరుపుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని, సహజ రంగులతో తయారైన విగ్రహాలను ప్రోత్సహించాలని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులు, ప్లాస్టిక్‌తో తయారయ్యే విగ్రహాల వల్ల చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులు కలుషితమై జలచరాలకు నష్టం కలుగుతోందని తెలిపారు. మన పూర్వీకులు మట్టి విగ్రహాలతో పండుగలు నిర్వహించేవారని గుర్తుచేస్తూ, అదే సంప్రదాయాన్ని కొనసాగించాలని సూచించారు. నీటి వనరులను కాపాడటం అంటే రైతులను, వ్యవసాయాన్ని, భవిష్యత్ తరాలను కాపాడటమేనని పేర్కొన్నారు. వినాయక మండపాల వద్ద పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పూజా సామగ్రి, ప్లాస్టిక్ వ్యర్థాలను చెరువులు, కుంటల్లో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. యువత, విద్యార్థులు, మహిళలు, రైతులు, వ్యాపారులు సహా అన్ని వర్గాల ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. “మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం. మన కల్వకుర్తిని పరిశుభ్రంగా, పచ్చగా తీర్చిదిద్దుదాం” అని గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

## కులాల మధ్య చిచ్చు పెడితే సహించేది లేదు

### తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై బండి వెంకటరెడ్డి ఆగ్రహం




**కొల్లాపూర్, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కులాల మధ్య చిచ్చుపెట్టి ప్రజల ఐక్యతను దెబ్బతీసే వ్యాఖ్యలను సహించేది లేదని కొల్లాపూర్ తాలూకా రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు బండి వెంకటరెడ్డి అన్నారు. తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కులంలో మంచి, చెడు వ్యక్తులు ఉంటారని, కొందరి తీరును మొత్తం కులానికి ఆపాదించడం సరికాదన్నారు. కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలపై పోలీసులు, సంబంధిత నిఘా సంస్థలు దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమాజంలో శాంతి, సామరస్యాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు అన్నారం అచ్చుతారెడ్డి, కోశాధికారి జగదీశ్వర్‌రెడ్డి, సలహాదారు రేమద్దుల ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఉప్పల వెంకటేష్



**కల్వకుర్తి, సెప్టెంబరు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉప్పల్ భగాయత్‌లో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయం భూమిపూజ, శ్రీనివాస కల్యాణం, ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరావాది లక్ష్మీనారాయణ ముఖ్యమంత్రిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సీఎంను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు, నాయకులు, సంఘం అనుబంధ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# నూతన ఎలక్ట్రిషియన్ కమిటీ ఏర్పాటు



**కల్వకుర్తి, సెప్టెంబరు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపాలిటీ, మండల నూతన ఎలక్ట్రిషియన్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవర్ల పర్వతాలు, ఉపాధ్యక్షుడిగా రషీద్‌ఖాన్, అధ్యక్షుడిగా ఉస్మాన్, ప్రధాన కార్యదర్శులుగా ఎండీ ఇంతియాజ్, గజ్జ ఆంజనేయులు గౌడ్, కోశాధికారిగా సాయిలు ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా పి. మల్లేశం, అబూబకర్, కమిటీ సభ్యులుగా జమీల్, ఇమ్రాన్‌ఖాన్, శాంతయ్య, రమేష్, ముఖ్య సలహాదారులుగా గన్నోజు బాబిదేవ్, ఎండీ అశ్వక్, నాని యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాత కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి, వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక ఎలక్ట్రిషియన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీస్ పీజీఆర్ఎస్ తాత్కాలిక రద్దు

**నంద్యాల, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద జిల్లా పోలీస్ కార్యాలయంలో సెప్టెంబర్ 14న జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు వ్యయప్రయాసలకు గురై పోలీస్ కార్యాలయానికి రావద్దని సూచించారు. సెప్టెంబర్ 21వ తేదీ సోమవారం నుంచి పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు. ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.



# ఉప్పల్ భగాయత్‌కు పెద్ద సంఖ్యలో తరలిన ఆర్యవైశ్యులు



**కల్వకుర్తి, సెప్టెంబరు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణ భూమిపూజ, శ్రీనివాస కల్యాణం, ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలకు కల్వకుర్తి నుంచి ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయ ఆవరణ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో ఆర్యవైశ్యులు హైదరాబాద్‌కు బయలుదేరారు. కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలివెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు.

# తాండ్ర సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



**కల్వకుర్తి, సెప్టెంబరు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తాండ్ర సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు కాయితి ఆశాదీప్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన రైతులు ఆదివారం కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ రాస్తారోకో నిర్వహించిన సందర్భంగా సర్పంచ్ రైతులను, బీఆర్ఎస్ కార్యకర్తలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదుదారులు ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అవివేకమని, సిగ్గుచేటని పేర్కొంటూ ఆశాదీప్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో రైతులు మైబు యాదవ్, యాకూబ్, మాజీ సర్పంచ్ బొల్లె సుశీల, ఈశ్వర్, అనిల్, లింగం ఉన్నారు. బీఆర్ఎస్ నాయకులు కిషోర్, సురేష్ పాల్గొన్నారు.

# ఎండిపోతున్న పంటలను పరిశీలించిన కాటసాని



**పాణ్యం, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పాణ్యం నియోజకవర్గం తమ్మరాజుపల్లె గ్రామంలో ఎండిపోతున్న పంట పొలాలను వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి పరిశీలించారు. రైతులను పరామర్శించిన ఆయన వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గోరకల్లు రిజర్వాయర్‌లో నీరు ఉన్నప్పటికీ సాగునీరు విడుదల చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. తక్షణమే పంటలకు నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందే వరకు వైఎస్సార్‌సీపీ రైతుల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.

# మృతుడి కుటుంబానికి ఉప్పల వెంకటేష్ ఆర్థిక సహాయం



**కల్వకుర్తి, సెప్టెంబరు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామానికి చెందిన మందహేచ్ గోపాల్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం గ్రామ బీఆర్ఎస్ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి తక్షణ ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్, మాజీ వార్డు సభ్యులు రొడ్డ ప్రభాకర్, మహ్మద్ ఖాజా, పెద్దరాజు చంద్రయ్య, రామస్వామి, రొడ్డ ఎలిశా, మండహేచ్ చంద్రయ్య, ఆంధ్రయ్య, అంజయ్య, సాయిలు, మొగులయ్యతో పాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# రామాసిపల్లి మైసమ్మ బోనాల్లో పాల్గొన్న రాఘవేందర్‌రెడ్డి



**కల్వకుర్తి, సెప్టెంబరు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో రామాసిపల్లి మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఆదివారం గ్రామస్థులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఐక్య ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైసమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మికతతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించడంలో ఇలాంటి పండుగలు ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, మైసమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోపవరం లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహణ



**నంద్యాల, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు, సబ్ డివిజన్ ఏఎస్పీ సుష్మిత సూచనలతో మహానంది మండలం గోపవరం గ్రామంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో అనుమానాస్పద ప్రదేశాలు, నివాస ప్రాంతాలను పరిశీలించి, గోపవరం మెట్ట వద్ద ఉన్న హోటల్ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 130 మద్యం బాటిళ్లు, 8 బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం విక్రయాలపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎటువంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు లేదా 100/112 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు.

# వినాయక చవితికి ముస్తాబైన గణనాథుని మండపాలు

**నేడు వినాయక చవితి వేడుకలు.. కొలువుదీరనున్న గణనాథుడు**



**కల్వకుర్తి, సెప్టెంబరు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి పట్టణం గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. పట్టణంలో 100కు పైగా గణనాథుని విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మండలంలోని వివిధ గ్రామాల్లోనూ భారీ విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో తరలించి ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. పూలు, పండ్లు, పూజా సామగ్రి, లడ్డూల కొనుగోలుకు వచ్చిన భక్తులతో కల్వకుర్తి ప్రధాన వీధులు సందడిగా మారాయి. గణనాథుని విగ్రహాల వద్ద విక్రయాలు ఊపందుకున్నాయి. ఇప్పటికే పట్టణంలో గణనాథుల ఆగమన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. దాండియా నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ వాహన శోభాయాత్రలతో గణనాథుడికి స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. నేడు గణనాథుడు మండపాల్లో కొలువుదీరనుండటంతో పట్టణంలో పండుగ సందడి నెలకొంది.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐసీసీటీయూ డిమాండ్




సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐసీసీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉదయ్ కిరణ్ డిమాండ్ చేశారు. కర్నూలులో జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రెసివ్ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, సామాజిక భద్రతను దెబ్బతీసే నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు. సెస్ నిధులను పూర్తిగా కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని, నిర్మాణ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డులు కల్పించాలని, ప్రమాద బీమాను రూ.50 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు దాటిన కార్మికులకు నెలకు రూ.10 వేల పింఛన్, ఇళ్ల స్థలాలు, పిల్లలకు విద్యా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సమస్యలను పరిష్కరించకపోతే విస్తృత ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం 23 మంది సభ్యులతో కర్నూలు జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే. బీముడు, ప్రధాన కార్యదర్శిగా షేక్ షబ్బీర్, ఉపాధ్యక్షులుగా మహబూబ్ బాషా, ఎస్. లతీఫ్ తదితరులు ఎన్నికయ్యారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజిద్దాం



**నంద్యాల, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా నంద్యాల జిల్లా యంత్రాంగం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా 3,000 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసింది. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ భవనం సమీపంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి ప్రజలకు విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల నిమజ్జనం వల్ల నీటి వనరులు కలుషితమవుతాయని తెలిపారు. మట్టి వినాయకులను ఇంటివద్దే నిమజ్జనం చేసి, అనంతరం అదే కుండీలో మొక్క నాటాలని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు భద్రతా నిబంధనలు పాటించాలని, విద్యుత్ లైన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిషోర్ రెడ్డి, జిల్లా అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# మద్దూరు కుంటను ఆధునీకరించాలని ప్రభుత్వానికి వినతి

**పాములపాడు, సెప్టెంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాములపాడు మండలం మద్దూరు--కృష్ణానగర్ గ్రామాల మధ్య ఉన్న ప్రభుత్వ కుంటను మరింత లోతుగా, వెడల్పుగా అభివృద్ధి చేయాలని నీటి సంఘం అధ్యక్షుడు తిమ్మారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. 2021లో 'నీరు--మీరు' కార్యక్రమంలో భాగంగా 4.75 ఎకరాల విస్తీర్ణంలో కుంటను నిర్మించినప్పటికీ ప్రస్తుతం పూడిపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి భూగర్భ జలాలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. కుంటను ఆధునీకరిస్తే భూగర్భ జలాలు పెరిగి ప్రజలు, పశువులకు తాగునీటి సమస్య తీరుతుందని ఆయన అన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ద్వారా జిల్లా కలెక్టర్ రాజకుమారి దృష్టికి తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.



Published & Printed by Desha Venkateshwarlu Published at H.no 6-2-591, Srinagar colony, Hyd. Road, Dist-Nalgonda, Telangana - 508001. Printed at SNEHITHA PRINTERS H.no 6-2-591,Srinagar colony, Hyd. Road, Dist-Nalgonda, Telangana - 508001. Editor : Desh Venkateshwarlu, RNI : TELTEL/2023/87644, Phone no- 9553338622

# చక్కని ఆరోగ్యం

## ముఖానికి ఇవి వాడకూడదట..!



ముఖ సౌందర్యం కోసం ఇటు ఇంటి చిట్కాలను, అటు బయట దొరికే వివిధ ఉత్పత్తుల్ని వాడుతుంటాం. అయితే వీటిలో ముఖానికి వాడకూడని పదార్థాలు కూడా కొన్నున్నాయంటున్నారు నిపుణులు. చర్మానికి తేమనందించడానికి బాడీ లోషన్ ఉపయోగించడం మనకు అలవాటే! అయితే కొంతమంది దీన్నే ముఖానికి కూడా వాడుతుంటారు. ఫలితంగా ఇందులోని జిడ్డుదనం ముఖ చర్మ రంధ్రాల్లోకి చేరి.. క్రమంగా మొటిమలు రావడానికి దారితీస్తుందట. ఇక దీనిలో ఉండే కృత్రిమ పరిమళాలు మృదువుగా ఉండే ముఖ చర్మంపై అలర్జీలు రావడానికి కారణమవుతాయి. కాబట్టి ముఖం కోసం ప్రత్యేకంగా తయారుచేసిన బ్యూటీ ఉత్పత్తులు.. ఎంచుకోవడం ఉత్తమం అంటున్నారు నిపుణులు. ముఖానికి ఉపయోగించే స్క్రబ్స్, ఫేస్‌ప్యాక్స్.. వంటి వాటిలో నిమ్మను ఉపయోగించడం సహజమే. కొంతమందైతే నిమ్మచెక్కను నేరుగా ముఖంపై రుద్దుకుంటుంటారు. అయితే ఇందులోని కొన్ని సమ్మేళనాలు కొంతమందిలో ముఖ చర్మాన్ని మరింత సున్నితంగా మార్చుతాయట. తద్వారా ఎండలోకి వెళ్లినప్పుడు చర్మం ఇరిటేషన్‌కి గురై దురద, మంట.. వంటి సమస్యలొస్తాయని చెబుతున్నారు నిపుణులు. మొటిమలున్న చోట టూత్‌పేస్ట్ రాయమని సలహా ఇస్తుంటారు కొందరు. కానీ వద్దంటున్నారు నిపుణులు. ఎందుకంటే కొంతమందిలో ఇది అప్లై చేసిన చోట నల్ల మచ్చలు, రంగు మారడం.. వంటి సమస్యలొచ్చే అవకాశం ఉంటుందట. అలాగే ఇందులోని గాఢమైన పదార్థాల వల్ల కొంతమందిలో ఇన్ఫెక్షన్లు, అలర్జీలు కూడా రావచ్చట! ముఖంపై అవాంఛిత రోమాల్ని తొలగించుకోవడానికి చాలామంది అనుసరించే పద్ధతి వ్యాక్స్ చేసుకోవడం. దీనికోసం వ్యాక్స్ స్ట్రిప్స్ వాడుతుంటారు. అయితే చర్మతత్వాన్ని బట్టి వీటిని ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేస్తే మాత్రం చర్మం ఎరుపెక్కడం, దద్దుర్లు రావడంతో పాటు చర్మం మరింత సున్నితంగా మారుతుంది. తద్వారా ఎండలోకి వెళ్లినప్పుడు కందిపోవడం, ర్యాషెస్.. వంటి సమస్యలొస్తాయట. కాబట్టి ఫేషియల్ వ్యాక్స్ ఎంచుకునే ముందు చర్మతత్వాన్ని పరిగణనలోకి తీసుకోవడం, ఇంట్లో తయారుచేసుకున్న వ్యాక్స్ అయినా.. బయటి నుంచి తెచ్చిన స్ట్రిప్ అయినా.. అప్లై చేసుకునే ముందు ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.



## రోజూ చూయింగ్ గమ్‌లను అదే పనిగా నములుతున్నారా.. అయితే జాగ్రత్త..

ముఖం సన్నగా కనిపించాలన్నా, దవడ ఆకృతి (జాలైన్) స్పష్టంగా రావాలన్నా చూయింగ్ గమ్‌ను ఎక్కువసేపు నమలడం ఉపయోగపడుతుందనే అభిప్రాయం యువతలో బలంగా ఉంది. దీంతో చాలామంది రోజూ గంటల తరబడి చూయింగ్ గమ్ నమలడం అలవాటుగా మార్చుకుంటున్నారు. అయితే ఇది ముఖాన్ని సన్నగా చేయకపోగా, దవడ కీళ్లపై అనవసర ఒత్తిడి పెంచి పలు ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దవడను పుర్రెతో కలిపే కీళ్లను టెంపరో మ్యాండిబ్యులర్ జాయింట్ (TM Joint) అంటారు. చెవులకు ముందు భాగంలో ఉండే ఈ కీళ్లు నమలడం, మాట్లాడడం, నోరు తెరవడం–మూయడం వంటి ప్రతి కదలికలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. అప్పుడప్పుడు చూయింగ్ గమ్ నమలడం వల్ల సాధారణంగా ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ గంటల తరబడి నిరంతరం నమలడం వల్ల ఈ కీళ్లపై పదేపదే ఒత్తిడి పడుతుంది. చూయింగ్ గమ్‌ను ఎక్కువసేపు నమలడం వల్ల దవడ కండరాలు అధికంగా పనిచేయాల్సి వస్తుంది. దీంతో క్రమంగా దవడ కీళ్లలో ఒత్తిడి పెరిగి కండరాలు అలసిపోవడం, కీళ్ల పనితీరు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితిని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక దవడ సమస్యలు తలెత్తుతాయి. దవడ కీళ్లపై అధిక ఒత్తిడి పడటం వల్ల కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. నోరు తెరిచినప్పుడు లేదా మూసినప్పుడు దవడ వద్ద క్లిక్ అనే శబ్దం వినిపించడం, దవడ బిగుసుకుపోవడం, చెవుల పక్కన లేదా కణతల వద్ద తలనొప్పి రావడం, ఆహారం నమిలేటప్పుడు నొప్పి అనిపించడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. చూయింగ్ గమ్ ను నమలడం వల్ల ముఖంలోని కొవ్వు కరిగి ముఖం సన్నగా మారుతుందనే అభిప్రాయానికి శాస్త్రీయ ఆధారాలు లేవు. ఇది దవడ కండరాలను కొంతవరకు బలపరుస్తుంది. కానీ శరీరంలోని ఒకే భాగంలో కొవ్వును కరిగించడం సాధ్యం కాదు. కొవ్వు తగ్గడం మొత్తం శరీర బరువు తగ్గుదలతో సంబంధం ఉన్న ప్రక్రియ. కాబట్టి చూయింగ్ గమ్‌ను ముఖానికి వ్యాయామంగా భావించడం సరైనది కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దవడ కీళ్లు కూడా శరీరంలోని ఇతర కీళ్ల మాదిరిగానే పరిమితంగా ఉపయోగించినప్పుడే ఆరోగ్యంగా ఉంటాయి. అవసరానికి మించి నిరంతరం ఒత్తిడి పెడితే సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందువల్ల అప్పుడప్పుడు చూయింగ్ గమ్ నమలడం సాధారణంగా హానికరం కాకపోయినా, అలవాటుగా గంటల తరబడి నమలడం మాత్రం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు.

## నిద్రను ఆహ్వానిద్దామా!



ఆధునిక జీవనశైలి కానుకగా ఇస్తున్న సవాళ్లలో నిద్రలేమి ఒకటి. ఒకవైపు ఆఫీసు పనులు, మరోవైపు ఇంటి బాధ్యతలు, ఇంకోవైపు రేపటి ప్రణాళికలు.. అన్నీ కలిసి మన మెదడును నిరంతరం పరుగులెత్తిస్తుంటాయి. ఇక, పగలు తీసుకునే కాఫీ, టీల అలవాటు నుంచి నిద్రపోయే ముందు చూసే వెబ్ సిరీస్‌ల ఉత్కంఠ వరకూ అన్నీ నిద్రను దూరం చేసే అలవాట్లే. మరి దీనికి పరిష్కారమేంటీ అంటారా? అది మన చేతుల్లోనే ఉందంటారు నిపుణులు. వాటిల్లో మొదటిది... రాత్రి నిద్రపోవడానికి కనీసం గంట ముందు నుంచే డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉండటం. బదులుగా ఆ సమయాన్ని పుస్తక చదవడానికో, నచ్చిన సంగీతం వినడానికో కేటాయిస్తే చాలు... నిద్ర ముంచుకొస్తుంది. అలానే, పడకగదిలో వెలుతురు తగ్గించుకుని శరీరాన్ని విశ్రాంతి స్థితిలోకి తీసుకెళ్లడమూ ఎంతో అవసరం. రాత్రి పూట మసాలా, నూనె ఆహారాలకి దూరంగా ఉండి, వేడి పాలో, హెర్బల్ టీనో తాగడం వల్ల శరీరానికి ఉపశమనం. అంతేకాదు, రేపటి పనుల గురించి ఆందోళన చెందడం కంటే, వాటిని ఒక డైరీలో రాసిపెడితే మనసు తేలికపడుతుంది. శ్వాసపై దృష్టిసారిస్తూ చేసే చిన్నపాటి ధ్యానంతో కునుకు దరికి చేరేలా చేయొచ్చు. ఎందుకంటే, నిద్రని బలవంతంగా పొందలేం... మనసునూ, శరీరాన్నీ ప్రశాంతపరుచుకుంటే అదే మనల్ని ఆహ్వానిస్తుంది. కాబట్టి, ఈ రాత్రి నుంచే ఈ చిన్న మార్పులను మొదలుపెట్టి, హాయిగా కళ్లు మూసుకోండి. రేపటి కొత్త ఉదయం ఉత్సాహంతో మీకు స్వాగతం పలుకుతుంది.

## జీన్స్‌తోనే నిద్రపోతున్నారా?



సందర్భం ఏదైనా.. కొంతమంది జీన్స్‌లోనే సౌకర్యంగా ఫీలవుతారు. అయితే ఇంటికొచ్చాక ఈ దుస్తులు మార్చుకొని వదులుగా ఉండే నైట్‌వేర్ ధరించినప్పుడే సౌకర్యంగా అనిపిస్తుంది. కానీ ఒక్కోసారి అనుకోకుండా అదే జీన్స్‌లో నిద్రపోవాల్సి రావచ్చు. అయితే దీనివల్ల అసౌకర్యమే కాదు.. ఆరోగ్యపరంగానూ కొన్ని సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి.. జీన్స్.. డెనిమ్ ఫ్యాబ్రిక్‌తో తయారవుతుంది. త్వరగా చెమటను పీల్చుకునే స్వభావం ఈ మెటీరియల్‌కు ఉండదు. అందులోనూ స్కిన్ టైట్ జీన్స్ అయితే ఇక చెప్పే పనే లేదు. ఫలితంగా జననేంద్రియాల వద్ద చెమట అలాగే ఉండిపోతుంది. ఈ తేమతోనే గంటల తరబడి ఉండిపోవడం వల్ల.. ఫంగల్ ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది. ఇది క్రమంగా ప్రత్యుత్పత్తి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందట. అలాగే బిగుతైన దుస్తుల వల్ల ఆయా శరీర భాగాలకు గాలి తగలక.. అక్కడి చర్మంపై దురద, దద్దుర్లు, ఎరుపెక్కడం.. వంటి సమస్యలొస్తాయి. కాబట్టి సాధ్యమైనంత తక్కువ సమయం జీన్స్ ధరించేలా చూసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. కొంతమందికి కాలంతో సంబంధం లేకుండా ఎక్కువగా చెమట పడుతుంటుంది. ఇలాంటివారు ఈ విషయంలో మరింత అలర్ట్‌గా ఉండడం మంచిదంటున్నారు. సాధారణంగా నిద్రలోకి జారుకున్న కొన్ని గంటలకు శరీర ఉష్ణోగ్రత క్రమంగా తగ్గుతూ వస్తుంది. అయితే జీన్స్ ధరించి నిద్రపోయినప్పుడు గాలి శరీరానికి తగలక.. శరీర ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది. తద్వారా నిద్రకు అంతరాయం ఏర్పడుతుందని ఓ అధ్యయనంలో తేలింది. అంతేకాదు.. జీన్స్ వంటి బిగుతైన దుస్తులు ధరించి పడుకోవడం వల్ల అసౌకర్యంగానూ అనిపిస్తుంటుంది. ఇది కూడా సుఖనిద్రను దూరం చేస్తుందని చెబుతున్నారు నిపుణులు. జీన్స్ వంటి బిగుతైన దుస్తులు ధరించి నిద్ర పోవడం వల్ల గర్భాశయం, పొత్తి కడుపు, జననేంద్రియాలపై ఒత్తిడి పడుతుంది. నెలసరి సమయంలోనూ అసౌకర్యంగా ఉంటుందంటున్నారు నిపుణులు. కాబట్టి పడుకునేటప్పుడైనా, ఇతర సమయాల్లో అయినా సాధ్యమైనంత వరకు వదులుగా ఉండే కాటన్ దుస్తులకు ప్రాధాన్యమివ్వడం మంచిదని సూచిస్తున్నారు నిపుణులు.

## డబుల్ చిన్ తగ్గాలంటే...

ఎంతందంగా తయారైనా, అద్దంలో చూసుకోగానే కనిపించే డబుల్ చిన్... మనసు కలుక్కుమనేలా చేస్తుంది. చాలామందిలో ఆత్మవిశ్వాసాన్నీ తగ్గిస్తుంది. అధిక బరువు, వయసు పెరగడం, జన్యుపరమైన కారణాలు, మెడ కండరాల బలహీనత వల్లా ఇలా జరగొచ్చు. ఏదేమైనా తగ్గించుకోవడానికి మన వంతు ప్రయత్నించాలి కదా! అందుకోసమే ఈ చిట్కాలు. చిన్ లిఫ్ట్స్: నిటారుగా నిలబడి, తలను వెనక్కి వంచి పైకప్పు వైపు చూడండి. ఇప్పుడు పెదాలను ముందుకు చాచి, సీలింగ్‌ను ముద్దాడినట్లు చేయండి. ఈ స్థితిలో 5 సెకన్ల పాటు ఉండి, తిరిగి సాధారణ స్థితికి రండి. ఇలా రోజుకు 15 సార్లు చేయడం వల్ల గడ్డం కింద కండరాలు బిగుతుగా మారతాయి. జా క్లెంచెస్: పెదాలను మూసి, దవడ కండరాలను గట్టిగా బిగించి 5–10 సెకన్ల పాటు ఉంచండి. ఆ తర్వాత మెల్లగా రిలాక్స్ అవ్వండి. ఇలా పదిసార్లు చేయడం వల్ల దవడ కండరాలు దృఢంగా మారి, క్రమంగా డబుల్ చిన్ తగ్గుతుంది. టంగ్ స్ట్రెచ్: తల నిటారుగా ఉంచి, నాలుకను సాధ్యమైనంత వరకు బయటకు చాచండి. అదే సమయంలో పైకి చూస్తూ నాలుక కొనతో ముక్కును తాకడానికి ప్రయత్నిస్తున్నట్లుగా 5–10 సెకన్లు ఉంచండి. ఇది మెడ కండరాలను సాగదీసి కొవ్వు తగ్గడానికి తోడ్పడుతుంది.



## మెడ చుట్టూ నల్లగా..

గర్భం దాల్చినపుడు శరీరంలో జరిగే మార్పుల వల్ల కొంతమందిలో సౌందర్యపరంగా సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా మెడ చుట్టూ నల్లగా తయారవడం అనేది గర్భిణులందరికీ ఎదురయ్యే సాధారణ సమస్య. అలా ఏర్పడిన నలుపుదనాన్ని ఎలా తగ్గించుకోవాలో తెలీక చాలామంది సతమతమవుతూ ఉంటారు. అయితే ఇంట్లోనే మనకు అందుబాటులో ఉన్న పదార్థాలతోనే ఈ సమస్యకు చెక్ పెట్టచ్చంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి.. చిన్న కీరాదోసను తీసుకొని జాగ్రత్తగా తురుముకోవాలి. ఈ తురుముతో నల్లగా మారిన మెడపై పదిహేను నిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. కీరాదోస క్లెన్సర్‌లా పనిచేసి మెడ చర్మంపై పేరుకున్న మురికిని తొలగిస్తుందట. కీరాదోస తురుముతో రోజూ మెడ చర్మాన్ని మర్దన చేసుకుంటూ ఉంటే కొద్ది రోజుల్లోనే చక్కటి ఫలితం కనిపిస్తుందంటున్నారు నిపుణులు. టమాటో, నిమ్మరసం, తేనెతో తయారు చేసిన మిశ్రమం మెడపై ఏర్పడిన నలుపును తొలగిస్తుందట. కొద్దిగా టమాటో రసం తీసుకొని దానిలో కొన్ని చుక్కల నిమ్మరసం, కాస్త తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మెడకు అప్లై చేయాలి. ఇరవై నిమిషాలు ఆరిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. బంగాళాదుంపను తొక్క తీసి మెత్తగా చేసుకోవాలి. దీనికి కాస్త నిమ్మరసం కూడా జత చేయాలి. ఈ మిశ్రమాన్ని మెడపై



అప్లై చేసుకొని పదిహేను నిమిషాల తర్వాత చల్లని నీటితో కడిగేసుకోవాలి. బంగాళాదుంప మంచి క్లెన్సర్‌గా పనిచేస్తుంది. ఇది నల్లగా మారిన చర్మాన్ని తిరిగి ప్రకాశవంతంగా అయ్యేలా చేస్తుంది. నిమ్మ బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుందని చెబుతున్నారు నిపుణులు.

అయితే పైన పేర్కొన్నవన్నీ సహజసిద్ధ పదార్థాలే అయినప్పటికీ.. చర్మతత్వానికి సరిపడతాయో లేదో తెలుసుకోవడానికి ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## ఇవి కూడా.. ప్రొటీన్ కోసం!

ఉదయం అల్పాహారంలో భాగంగా కోడిగుడ్లు తీసుకోవడం కొంతమందికి అలవాటు. రోజంతా శక్తి స్థాయులు స్థిరంగా ఉండాలన్నా, ఎక్కువసేపు ఆకలేయకుండా బరువును అదుపులో ఉంచుకోవాలన్నా ఇందులోని ప్రొటీన్ సహాయపడుతుంది. అయితే రోజూ గుడ్లు తినీ తినీ బోర్ కొడుతుందనే వారూ లేకపోలేదు. అలాంటి వారు అయిష్టంగానో, బలవంతంగానో వీటిని తీసుకోవడం కంటే ప్రొటీన్లు అధికంగా లభించే ఇతర పదార్థాల్ని బ్రేక్‌ఫాస్ట్‌లో చేర్చుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఇంతకీ అవేంటో తెలుసుకుందాం రండి..

యోగర్ట్‌లో ప్రొటీన్ శాతం అధికంగా ఉంటుంది. కాబట్టి ఉదయాన్నే అల్పాహారంగా ఓ కప్పు యోగర్ట్ తీసుకోవచ్చు. ఇలా ప్లెయిన్‌గా తినడానికి ఇష్టపడని వారు ఇందులో పండ్ల ముక్కలు, బాదంపప్పులు, వాల్‌నట్స్, గింజలు.. వంటివి కలుపుకొని తినచ్చు. ఫైబర్ అధికంగా ఉండే ఈ నట్స్‌ని ప్రొటీన్‌తో కలిపి తీసుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండచ్చంటున్నారు నిపుణులు.

ప్రొటీన్లు ఎక్కువగా లభించే పదార్థాల్లో పనీర్ ఒకటి. దీంతో బుర్జీ తయారుచేసుకొని తీసుకున్నా సమాన ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. ఉల్లిపాయ, క్యాప్సికం, పచ్చిమిర్చి, టొమాటో ముక్కల్ని నూనెలో వేయించి.. మెదిపిన పనీర్‌ని ఇందులో వేసి తయారుచేసేదే పనీర్ బుర్జీ. దీన్ని గోధుమ లేదా మల్టీ గ్రెయిన్ బ్రెడ్‌పై వేసుకొని తినచ్చు. లేదంటే కుల్చా, పరాటా, చపాతీకి కాంబినేషన్ కర్రీగా కూడా తీసుకోవచ్చట. రాత్రి పూట పెరుగు లేదా పాలల్లో కొన్ని ఓట్స్ కలపాలి. ఉదయాన్నే దీంట్లో కొన్ని నట్స్, పండ్ల ముక్కలు చల్లుకొని తింటే రుచికి రుచి.. ప్రొటీన్లూ శరీరానికి అందుతాయంటున్నారు నిపుణులు. పాలు, పెరుగు, ఓట్స్.. ఈ మూడింట్లోనూ ప్రొటీన్లు ఎక్కువగా లభిస్తాయని చెబుతున్నారు. మొలకెత్తిన గింజలతో తయారుచేసిన సలాడ్‌నీ ఉదయం అల్పాహారంగా తీసుకోవచ్చంటున్నారు నిపుణులు. పెసలు, శెనగలు, బఠానీ, బొబ్బర్లు, రాజ్మా.. వంటి ధాన్యాల్లో ప్రొటీన్లు ఎక్కువగా లభిస్తాయి. ఇవి మొలకలొచ్చాక.. వీటిలో టొమాటో, ఉల్లిపాయ ముక్కలు కలుపుకొని.. కొత్తిమీర–పుదీనా తురుముతో గార్నిష్ చేసుకొని.. కొద్దిగా నిమ్మరసం పిండి తీసుకుంటే రుచిగా ఉంటుంది. ప్రొటీన్లూ శరీరానికి అందుతాయి. పెసరపప్పును నానబెట్టి మెత్తగా రుబ్బుకొని.. కాస్త మందపాటి దోశలా వేసుకొని తయారుచేసుకొనే చిల్లా వంటకం



గురించి చాలామందికి తెలుసు. అయితే దీన్ని ప్లెయిన్‌గా తీసుకుంటే తినడం కష్టం.. కాబట్టి దోశ వేసుకొనేటప్పుడే కాస్త ఉప్పు, కారం చల్లి.. కాయగూర ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు వేసి కాల్చుకుంటే ఎంతో రుచిగా ఉంటాయి. ఈ పప్పులోనూ ప్రొటీన్ అధికంగా ఉంటుంది. వేడివేడి ఈ దోశల్ని క్రీమీగా చిలికిన పెరుగు లేదంటే చట్నీతో తీసుకుంటే రుచిగా ఉంటాయి. ఇక్కడ పెసరపప్పు బదులుగా శెనగపప్పు కూడా ఉపయోగించచ్చు.

బ్రెడ్–పనీర్ బటర్.. చాలామంది దీన్ని అల్పాహారంగా తీసుకోవడం చూస్తుంటాం. ఈ బటర్‌లో ప్రొటీన్ అధికంగా లభిస్తుంది. అయితే ఇక్కడ వైట్ బ్రెడ్‌కు బదులుగా గోధుమ, మల్టీగ్రెయిన్ బ్రెడ్ తీసుకోవడం మేలంటున్నారు నిపుణులు. కావాలంటే బ్రెడ్‌పై బటర్ అప్లై చేసుకున్నాక.. పండ్ల ముక్కలు, నట్స్, తేనె.. వంటివి వేసుకొని తీసుకుంటే రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం..!

సత్తూ డ్రింక్ కూడా చాలామందికి తెలిసిన పానీయమే! పుట్నాల పొడిని నీటిలో కలుపుకొని.. తగినంత ఉప్పు, చిటికెడు మిరియాల పొడి వేసి, నిమ్మరసం పిండుకొని.. దీన్ని తయారుచేసుకోవాలి. ఒకవేళ తియ్యగా కావాలనుకునే వారు బెల్లం పొడి కలుపుకోవచ్చు. పుట్నాలలో ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది.. తద్వారా రోజంతటికీ కావాల్సిన శక్తిని పొందచ్చంటున్నారు నిపుణులు.





# 'సలార్' ఫైట్ పాక్‌లో కాపీ.. అసలు నిజమేంటి?

పాన్ ఇండియా స్టార్ అయిన తర్వాత ప్రభాస్ చేసిన ఫుల్ లెంగ్త్ యాక్షన్ సినిమా 'సలార్'. కేజీఎఫ్ తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించేసరికి ఈ మూవీపై విపరీతమైన అంచనాలు ఏర్పడ్డాయి. కానీ విడుదల విషయంలో పలుమార్లు వాయిదా పడటంతో ఎందుకనో థియేటర్లలో సరిగా ఫెర్ఫార్మ్ చేయలేదు. కానీ తర్వాత కాలంలో ఓటీటీ, టీవీలో ప్రసారమైన తర్వాత విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇప్పటికీ ఏదో ఒక సందర్భంలో 'సలార్' గురించి వినిపిస్తూనే ఉంటుంది. కానీ రీసెంట్‌గా కొన్నిరోజుల నుంచి 'సలార్' ఫైట్ సీన్‌ని పాకిస్తాన్‌కి చెందిన ఓ సినిమాలో కాపీ కొట్టారని చెప్పి సోషల్ మీడియాలో ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. కానీ ఇది ఏ మాత్రం నిజం కాదు. పాక్‌కి చెందిన హసీబ్ బిలాల్ అనే ఇన్ఫ్లుయెన్సర్.. ఏఐ ఉపయోగించి 'సలార్' స్ఫూర్తిగా తన ప్రతిరూపంలో వీడియో సృష్టించి దానిని తన ఇన్ స్టాలో పోస్ట్ చేశాడు. చూడటానికి ఇది రియల్‌గా ఉండేసరికి చాలామంది ఇది నిజమని అనుకుంటున్నారు. ఇకపోతే ప్రస్తుతం ఫౌజీ, స్పిరిట్, కల్కి 2 సినిమాలతో ప్రభాస్ బిజీగా ఉండగా.. మరోవైపు ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్‌తో 'డ్రాగన్' చేస్తున్నాడు. మరి వీళ్లు ఈ ప్రాజెక్టులు పూర్తి చేసిన తర్వాత 'సలార్ 2' కోసం కలుస్తారేమో చూడాలి? దీని కోసం ప్రభాస్ ఫ్యాన్స్ కాస్త గట్టిగానే ఎదురుచూస్తున్నారు.

# రచ్చ లేపడానికి రెడీ.. ఒక్క పోస్టుతో 'స్వయంభూ'పై అంచనాలు పెంచేసిన నిఖిల్



యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడిక్ చిత్రం 'స్వయంభూ'పై అంచనాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై నిఖిల్ తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ పంచుకున్నారు. ఒకే సినిమా కోసం 175 రోజులు షూటింగ్ చేయడం, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉండటం తన కెరీర్‌లో ఇదే తొలిసారని ఆయన తెలిపారు. మంచి ప్రయత్నాలకు సమయం పడుతుందని, త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు నిఖిల్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ""స్వయంభూ' ఒక పాన్ ఇండియా చిత్రంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మంచి పనులకు సమయం పడుతుంది. మేము దాదాపు ఆ దశకు చేరుకున్నాం. ఒకే సినిమా కోసం 175 రోజులు షూట్ చేస్తానని, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉంటాయని నేను ఎప్పుడూ ఊహించలేదు. కానీ... రచ్చ లేపడానికి రెడీ. త్వరలోనే విడుదల తేదీ ప్రకటన ఉంటుంది" అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది. ఇటీవల హీరోయిన్ సంయుక్త పుట్టినరోజు సందర్భంగా, ఆమె పోషిస్తున్న 'భూమి' పాత్రకు సంబంధించిన ఒక బీటీఎస్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె పడిన కష్టం స్పష్టంగా కనిపించింది. ఈ సినిమా కోసం సంయుక్త ఎంతో ధైర్యంగా ఒక ప్రమాదకరమైన స్టంట్ చేశారని దర్శకుడు భరత్ కృష్ణమాచారి గతంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లిలో చిత్రీకరించిన ఒక సన్నివేశంలో, కింద నది ప్రవహిస్తుండగా కేవలం ఒకే ఒక్క హార్నెస్ సాయంతో ఆమె రెండు రోజుల పాటు తాడుపై వేలాడుతూ పర్వతాన్ని అధిరోహించారని వివరించారు. ఈ సినిమా కోసం హీరో నిఖిల్ కూడా వియత్నాం వెళ్లి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. రెండు చేతులతో కత్తి యుద్ధం చేయడంలో ఆయన ప్రావీణ్యం సంపాదించారు. కేవలం హీరో, హీరోయిన్లు మాత్రమే కాకుండా సినిమాలో నటించిన వందలాది మంది సహాయ నటీనటులకు కూడా వియత్నాం నుంచి వచ్చిన నిపుణులతో కత్తి యుద్ధంలో శిక్షణ ఇప్పించారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో దాదాపు 60 రోజుల పాటు భారీ క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. భారతీయ సాంస్కృతిక వారసత్వపు మూలాలతో, ఒక యోధుడి గాథ ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న 'స్వయంభూ' విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# నా సినిమాలను నేను చూడలేను

ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె 'వైబ్' అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు 'బట్వారా 1947' చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. 'వైబ్'లో ఆమె 'మేడమ్ హెచ్' అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు 'ఇంపాస్టర్ సిండ్రోమ్' అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు 'చేయగలనా, లేదా?' అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. "నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది" అని ప్రీతి వెల్లడించింది.



## మహిళలు మాత్రమే తాళి వేసుకోవాలా.. పెళ్లి గుర్తుగా పురుషులు కూడా ఏదైనా ధరించాలి: నటి నమిత



ఒకప్పుడు దక్షిణాది చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి నమిత... పెళ్లి చేసుకున్న తర్వాత సినిమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా వివాహ వ్యవస్థ, మహిళలపై అమలవుతున్న సంప్రదాయ నిబంధనలపై చేసిన వ్యాఖ్యలతో మరోసారి చర్చల్లో నిలిచారు. వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల జీవితాలను, భావోద్వేగాలను కలిపే సమానమైన బంధమని... అలాంటప్పుడు పెళ్లికి సంబంధించిన నియమాలు, బాధ్యతలు కేవలం మహిళలకే ఎందుకు పరిమితం కావాలని ఆమె ప్రశ్నించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. వివాహ ఆచారాల గురించి మాట్లాడుతూ... పెళ్లి తర్వాత మహిళలు ఎలా ఉండాలి, ఏం ధరించాలి, ఏయే సంప్రదాయాలను పాటించాలి అనే విషయంలో సమాజంలో ఎన్నో నియమాలు ఉంటాయని నమిత అన్నారు. కానీ పురుషుల విషయంలో ఇలాంటి నిబంధనలు, ఆంక్షలు చాలా తక్కువగా ఉండటం సరైనది కాదని... మారుతున్న కాలానికి అనుగుణంగా అందరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా వివాహానికి గుర్తుగా మహిళలు మాత్రమే తాళిబొట్టు ఎందుకు ధరించాలని, పెళ్లయిందనే గుర్తింపుగా పురుషులు కూడా ఏదో ఒక గుర్తును ఎందుకు ధరించకూడదని ఆమె అన్నారు. నమిత చేసిన ఈ వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఆధునిక కాలంలో భార్యాభర్తలిద్దరికీ సమాన హక్కులు, ప్రాధాన్యత ఉండాలని కోరుకునే కొందరు నెటిజన్లు ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తుండగా... మరికొందరు మాత్రం తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యతను అర్థం చేసుకోకుండా ఇలా ప్రశ్నించడం సరికాదని విమర్శలు గుప్పిస్తున్నారు.



# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' టీజర్ ఇదిగో.. నవ్వులతో మొదలై థ్రిల్లింగ్ మలుపు!

తెలుగు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కాంబినేషన్లలో విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌లది ఒకటి. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నెం: 47 / ఏకె 47) సినిమా నుంచి అభిమానులకు అదిరిపోయే ట్రీట్ వచ్చింది. తాజాగా విడుదలైన ఈ చిత్రం టీజర్, అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్ ఆరంభం నుంచి త్రివిక్రమ్ మార్క్ స్పష్టంగా కనిపించింది. సరికొత్త లుక్‌లో కనిపించిన వెంకటేశ్, తనదైన కామెడీ టైమింగ్, డైలాగ్ డెలివరీతో కట్టిపడేశారు. "డబ్బు సబ్బు లాంటిది రా, చేతులు కడుక్కోవడానికే పనికొస్తుంది", కుటుంబం అప్పుల లెక్కలు చెప్పే సన్నివేశాలు, వంటింట్లో జరిగే సంభాషణలు ప్రేక్షకుల పెదాలపై నవ్వులు పూయించాయి. మధ్యతరగతి కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను వినోదాత్మకంగా చూపిస్తూనే, కథలో కీలక మలుపును పరిచయం చేశారు. కుటుంబమంతా కలిసి 'ఏకె 47' అనే పేరున్న ఓ డ్యూప్లెక్స్ ఇంట్లోకి మారడంతో కథ మరో స్థాయికి వెళుతుంది. అంతా సంతోషంగా సాగుతున్న సమయంలో ఓ క్రైమ్ సంఘటన జరగడం, విలన్ ఎంట్రీతో టీజర్ ఒక్కసారిగా సీరియస్ టర్న్ తీసుకుంటుంది. దీంతో ఈ సినిమా కేవలం కుటుంబ కథ మాత్రమే కాదని, ఇందులో థ్రిల్లింగ్ అంశాలు కూడా ఉన్నాయని స్పష్టమవుతోంది. కామెడీ, ఎమోషన్స్, సస్పెన్స్‌తో కూడిన ఒక సంపూర్ణ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను త్రివిక్రమ్ సిద్ధం చేసినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్రంలో వెంకటేశ్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. నారా రోహిత్, దివ్యేందు శర్మ, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిశోర్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో భాగమయ్యారు. తమన్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు అదనపు ఆకర్షణగా నిలిచింది. నిర్మాతలు ఈ చిత్రాన్ని గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విడుదలైన కొద్ది గంటల్లోనే విశేష స్పందన రాబట్టుకున్న ఈ టీజర్, సినిమాపై ఉన్న అంచనాలను తారాస్థాయికి చేర్చింది.